విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 08 ఏప్రిల్ 2025 8 పేజీలు

అనారోగ్య నిలయాలు... తీర గ్రామాలు

లివర్ వ్యాధి వ్యాప్తికి నాసిరకం మద్యం కారణమా?

విశాలాంధ్ర - కాట్రేనికోన : సముద్ర తీర గ్రామాలు అనారోగ్య నిలయాలుగా మారాయి అంటే అతిశయోక్తి కాదేమో! కాని ఇది అక్షరాల నిజమనిపిస్తోంది. ఇటీవల తీరంలోని పల్లం గ్రామంలో హెపటైటిస్ మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. స్థానికంగా సామాజిక, ఆర్థిక కారణాలతో పాటు మూఢనమ్మకాలు, నిరక్షరాస్యతతో మత్స్యకారులను దీర్ఘకాలవ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. వీరు బాహ్య ప్రపంచానికి దూరంగా కనీస సౌకర్యాలు కరువై దయనీయ జీవితాలు గడుపుతున్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే. సరైన వైద్యం, తాగునీరు అందక రోగాల బారిన పడుతున్నారు. మండలంలో 50 వేలకు పైగా జనాభా ఉన్నారు. మత్స్యకారులకు ఏ పెద్ద జబ్బు వచ్చినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని హుటా హుటిన అమలాపురం, రాజమండ్రి, కాకినాడ పట్టణాలలోని ఖరీదైన ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లాల్సిందే. ఆర్థిక స్థోమత లేనివారు ఇంటి వద్దనే మృత్యు వాత పడుతుం టారు. కనీసం మండల కేంద్రమైన కాట్రేనికోన పీహెచ్‌సీ నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. పాలకులు ఎవరూ ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడరు. అభివృద్ధి చేయాలన్న ఆలోచన వారికి ఉండదు. ఇక్కడ మొక్కుబడిగా ప్రాథమిక వైద్యం తప్ప వేరే చికిత్సలు, వైద్యం ఉండవు. తాజాగా పల్లం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశాఖ సర్వేలో పెద్ద సంఖ్యలో లివర్ వ్యాధిగ్రస్తులు బయటపడుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక్క పల్లం గ్రామంలోనే కాదు మండలం లోని తీర గ్రామాలైన బలుసు తిప్ప, నీళ్ల రేవు, పండి, పోర, మొల్లేటిమొగ, కొత్తపాలెం, గచ్చ కాయలపోర తదితర తీర గ్రామాల్లో ఇదే తరహాలో ▶మిగతా 2లో..

ఈ శ్రమ పోర్టల్ వినియోగించుకోండి

- 17 వరకు ప్రత్యేక డ్రైవ్
- కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : డెలివరీ రంగంలో పనిచేసే ఉద్యోగులు / కార్మికులు ఉచితంగా పేరు నమోదు చేసుకొని కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసే గుర్తింపు కార్డు పొందడం ద్వారా సంక్షేమ పథకాలు పొందవచ్చునని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలియచేసారు. అమెజాన్, జొమాటో, స్విగ్గీ, ఉబర్, రాపిడో, ఓలా, బిగ్ బాస్కెట్ ఫ్లిప్‌కార్ట్ బ్లింకిట్ లాంటి సంస్థల్లో పనిచేసే కార్మికులు ప్లాట్ ఫారం వర్కర్స్ గా గుర్తింపు కలిగి, గిగ్-ఆధారిత పద్ధతిలో ఆన్లైన్ ప్లాట్ ఫారం (మొబైల్ యాప్స్) ద్వారా పనిచేసే అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం జారీ చేసే గుర్తింపు కార్డులు పొందుటకు అర్హులని తెలియ చేశారు. తద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ▶మిగతా 2లో..

చిన్న రేషన్‌కార్డులు వచ్చేశాయి

- ఏటీఎం కార్డు సైజులో రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులకు ఏటీఎం కార్డు సైజులో ఉండే విధంగా కా ర్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో పౌరసరఫరాల శాఖ ప్రారంభించింది. ఈ కార్డుల పంపిణీ విధానం తదితర వ్యవహారాలు పారదర్శకంగా జరుగుతా యని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్డు ముందు భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుంది. వెనుక భాగంలో కుటుంబ సభ్యుల వివరాలు ఉండనున్నాయి. మే నెలలో నూతన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించేందుకు ఆన్లైన్ విధానం సిద్ధం చేస్తున్నారు. ఈ నెలలో దరఖాస్తులను స్వీకరిస్తారు. కుటుంబ సభ్యుల పేర్లు మార్పులు, చేర్పులు చేసేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నారు . ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులకు ఈ కేవైసీ చేయించు కోవాలని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు రేషన్ కార్డు లబ్ధిదారులకు మార్చి 31 వరకు సమయమిచ్చినా ఇంకా చాలామంది చేయించుకోనందునఏప్రిల్ 30 వరకు గడువును పొడిగించారు.

కాతేరులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సీపీఐ ధర్నా

విశాలాంధ్ర- రాజమండ్రి రూరల్ : రాజమండ్రి రూరల్ కాతేరు పంచాయతీ సుబ్బారావు పేట, తాడి కట్ల వారి వీధి లో అనేక సమస్యలు పేరుకుపోయాయని, వెంటనే ఆ సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో కాతేరు సచివాలయం వద్ద సుమారు గంటపాటు ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ గత రెండు నెలలుగా మంచినీరు లేక ప్రజలు విల విల్లాడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ సౌకర్యం కూడా లేకపోవడంతో మురికి నీరు రోడ్డు మీదే ప్రవహిస్తున్నదని అన్నారు. మంచినీరు పైపులు వేసి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ మంచినీరు రాలేదన్నారు. దోమకాటు వల్ల విష జ్వరాలతో చిన్న పిల్లలతో సహా వృద్ధులు ఆసుపత్రి పాలవుతున్నారని తెలిపారు. చెత్త తీసుకువెళ్లే వాహనాలు కూడా రావడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రజల చేత ఇంటి పన్నులు, కుళాయి పన్నులు కట్టించుకోవడమే తప్ప కనీసం వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పంచాయతీ ఘోరంగా విఫలం చెందుతున్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, నగర కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, పి.లావణ్య, చింతలపూడి సునీల్, పి. త్రిమూర్తులు, టి. నాగేశ్వరరావు, స్థానిక నాయకులు సావిత్రి, వెంకటలక్ష్మి, శ్రీదేవి, వరలక్ష్మి సూర్యకుమారి లక్ష్మి పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాచారంతో సిద్ధంగా ఉండండి

- త్వరలో సీఎం నూజివీడు నియోజకవర్గ పర్యటన
- కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో ఈనెల 11వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వివిధ కార్యక్రమాలలో పాల్గొనవచ్చునని,ఈ దృష్ట్యా వివిధ శాఖల అధికారులందరూ తమ శాఖలకు సంబంధించి అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. నూజివీడు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 11వ తేదీన నూజివీడు నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలతో పాటు,పీ4 కార్యక్రమంలో భాగంగా నిరుపేద కుటుంబాలను కలిసి వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమం, అనంతరం ప్రజావేదికలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందన్నారు. గ్రామంలోని అత్యంత నిరుపేదల వివరాలు,వాటి సామాజిక,ఆర్థిక పరిస్థితి,వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు ▶మిగతా 2లో..

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: పిజిఆర్ఎస్ అర్జీలకు నిర్ణీత గడువులోపుగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా,డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని అర్జీదార్ల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమై నిర్ణీత గడవులోపుగా ఫిర్యాదులను పరిష్కరించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రెడ్ క్రాస్ మెంబర్ షిప్‌లను సాధ్యమైనంత ఎక్కువగా చేయడానికి జిల్లా, మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో మెంబర్షిప్ చేరికల సంఖ్య చాలా తక్కువగా ఉందని,కొన్ని మండలాల్లో ప్రారంభమే కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా 279 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పి.డి డా.కె.సి.హెచ్ అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ ఒక్కరూ రక్తదానమునకు ముందుకు రావాలని జిల్లా కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో సోమవారం రక్తదాన శిబిరాన్ని జ్యోతి వెలిగించి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరమవుతుందని,దాతల నుండి సేకరించిన రక్తాన్ని వారికి అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ వారి పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సమయాలలో రక్తదానం చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. జిల్లా సహకార అధికారి ఎ. శ్రీనివాస్ మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి "అంతర్జాతీయ సహకార సంవత్సరం"గా ప్రకటించిందని, ఈ కార్యక్రమంలో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డా.ప్రసాదరావు, డిసిఎంఎస్ బిఎం వి. ఎస్. కృష్ణమోహన్, సిబ్బంది సుధాకరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ చీడే జన్మదినోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: డాక్టర్ సిఎస్ఎన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ జన్మదిన వేడుకలను కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు, పాలక వర్గ సభ్యులు ఇరికిం సూర్యనారాయణ, వడుపు గోపి, వి.ఎస్.కె కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఒబిలిశెట్టి పట్టాభిరామయ్య , డిగ్రీ, పి.జి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ల సత్యనారా యణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సలీం ఖాన్, ప్రిన్సిపల్ ఎం.నిర్మల, డిఇడ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, హెచ్.ఓడిలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి మనిషి ఆరోగ్యం కోసం అరగంటసేపు నడవాలని, వ్యాయామం చేయాలని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని భీమవరం ఇంపీరియల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అయినా మోహన్ కృష్ణ, డాక్టర్ నాగరాజు అన్నారు. సోమవారం గణపవరం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పి.ఎం.పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఇంపీరియల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గణపవరం పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు మండా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సరిపల్లె సాయిబాబా మందిరంలో భీమవరం ఇంపీరియల్ హాస్పిటల్స్ వారిచే అవగాహన సదస్సు, సర్వసభ్య సమావేశంజరిగింది. గౌరవ అతిథులుగా రాష్ట్ర పి ఎం పి అసోసియేషన్ గౌరవ సలహాదారులు ఎన్.జయసూర్య, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఏ ఆర్ కె పరమేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జయరాం, జిల్లా జాయింట్ సెక్రెటరీ నిమ్మల సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు మండల అధ్యక్షులు మూర్తి, నిడమర్రు మండల ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసరావు, కొట్టకల అప్పారావు, సహాయ కార్యదర్శి కేటీఎన్ సత్యనారాయణ (నాని), జి. శ్రీను, గణేష్, పానకాలు, బాల బాలాజీ, మధు, విజయ్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధంగా ఉండండి

(1వ పేజీ తరువాయి)

తీసుకోవలసిన చర్యలు, తదితర అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు జరుగుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను ముఖ్యమంత్రి అడిగే అవకాశం ఉందని,కావున సంబంధిత శాఖల అధికారులందరూ తమతమ శాఖలకు సంబంధించిన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

బిసి లోన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖల అధికారులు లబ్ధిదారులను, రుణాల మంజూరు చెక్కులను సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి విచ్చేసే గ్రామం, మండలాలకు సంబంధించి స్వర్ణాంధ్ర-2047 కార్యాచరణ ప్రణాళికలను, స్థానిక సమస్యల వివరాలు,ఆయా ప్రాంతాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు తదితర వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్,జిల్లా పరిషత్ సీఈఓ కె.భీమేశ్వరరావు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, డిపిఓ కె. అనురాధ,పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినియోగించుకోండి

(1వ పేజీ తరువాయి)

సంక్షేమ పథకాలను పొందుటకు, అర్హులవుతారని పేర్కొన్నారు. అమెజాన్, స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్, రాపిడో, ఉబర్, ఓలా ఫ్లిప్కార్ట్ బ్లింకిట్ ల ద్వారా ఆహార, సరుకు రవాణా, డెలివరీ రైడ్- షేరింగ్, కొరియర్ సేవలు అందించే వ్యక్తులు. డ్రైవర్లు లేదా ప్లాట్ఫారమ్ కార్మికులందరూ అసంఘ టిత రంగ కార్మికుల క్రిందికి వస్తారు. వీరందరూ ఉచిత నమోదుకు అర్హులు అని పేర్కొన్నారు. వార్డ్ గ్రామ సచివాలయాలు, కార్మిక శాఖ కార్యాలయాల్లో, సెంటర్స్, ఉచిత నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సహాయ కార్మిక కమిషనర్ బి.యస్.యమ్ వలి వివరాలు తెలియ చేస్తూ శ్రామిక శక్తిని ప్రోత్సహించడానికి కేంద్ర బడ్జెట్ 2025-26లో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కొరకు కొన్ని సంక్షేమ ప్రయోజనములను ప్రతిపాదించారన్నారు . ఈ ప్రయోజనములు పొందుటకు ప్లాట్ఫామ్ కార్మికులు వారి పేర్లు ఈ శ్రమ పోర్టల్ లో అప్లోడ్ నమోదు చేసుకోవాలని తెలియ చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7 నుండి 17 తేదీ వరకు ప్రత్యేక ప్రచార, అవగాహన మరియు నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వయస్సు 16 నుండి 59 సం మధ్య ఉండాలని, ఆదాయపు పన్ను పరిధిలో లేని వారు ప్రయోజనం పొందవచ్చన్నారు.

తీర గ్రామాలు

(1వ పేజీ తరువాయి)

సర్వే చేస్తే వందలాది లివర్ వ్యాధిగ్రస్తులు వెలుగులోకి వస్తారనే భయం లేకపోలేదు. ముఖ్యంగా తీర గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులు, అంటు వ్యాధుల నివారణకు ప్రణాళికలు ఉండవు. ఏదో వారానికో, నెలకో వైద్య సిబ్బంది వచ్చి నాలుగు బిళ్ళలు ఇచ్చి వెళ్లిపోతూ ఉంటారు. తరచూ వ్యాధి నిర్ధారణకు పరీక్షలు చేయరు. తరచూ వివిధ అనారోగ్య కారణాల వల్ల మత్స్యకారులు మృత్యు వాత పడుతున్నా ఎవరికీ పట్టదు. ఏదో జబ్బు వచ్చింది వయసు అయిపోయింది చనిపోయాడు అనుకుని సరిపెట్టుకోవడం తప్ప చేయగలిగింది ఏమీలేదు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా హడావిడిగా డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది వచ్చి సర్వేలు చేసి చేతులు దులుపుకోవడమే కానీ వ్యాధుల నివారణకు శాశ్వత పరిష్కారం శూన్యంగా ఉంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి అసలు మూలాలను పట్టించుకోవడం లేదనేది జగమెరిగిన సత్యం. ముఖ్యంగా హెపటైటిస్ సి కాలేయ వ్యాధులు వ్యాప్తికి అతిగా మద్యం తాగడమే ప్రధాన కారణంగా డాక్టర్లు చెబుతారు.

వీటితోపాటు తీర గ్రామాల్లో పారిశుధ్యలోపం, జీవన శైలి, ఆహార అల వాట్లు, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు తోడవుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ అనుమతి లేకుండా తీర గ్రామాల్లో అక్రమ మద్యం షాపులు బహిరంగంగా నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించుకోరు. వీటి నిర్వహణకు లక్షల్లో వేలం పాటలు పెడుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారనే చెప్పాలి. కేంద్ర పాలిత ప్రాంతం యానం నుండి కాకినాడ కోన తీర గ్రామాలకు అక్రమ రవాణా చేసి నాసి రకం మద్యంను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ములు కాజేస్తున్నా ఎవరికీ పట్టదు. యానాం ఎన్డిపిఎల్ మద్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న 99 రూపాయల చీప్ మద్యం బాటిల్ను రు.150 నుండి రు.200 వరకు విక్రయిస్తున్నారు.

యానంలో క్వార్టర్ చీప్ బాటిల్ 60 నుండి 70 రూపాయలకు మాత్రమే అతి తక్కువ ధరకు హోల్సేల్గా కొనుగోలు చేసి సముద్ర తీర గ్రామాలకు అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసింది.

ఈ నాసిరకం మందులో అధిక శాతం స్పిరిట్, ఆల్కహాలు ఉండడంతో నిరక్షరాసులైన మత్స్యకారులు తప్పతాగి లివర్ వ్యాధుల పాలవుతున్నారు. సముద్రం, ఉప్పు టేర్లు, గోదావరి పాయలలో రాత్రింబవళ్లు కష్టపడి వేటాడి తిరిగి వచ్చిన మత్స్యకారులు మద్యం తాగడం సహజంగా వస్తోంది. నీటిలో వేటాడిన తమకు మందు తాగితే ఒళ్ళు నొప్పులు పోయి సేదతీరుతామని, మర్నాడు వేటకు ఏ సమస్య లేకుండా సిద్ధమవుతామని మత్స్యకారులు చెబుతారు. ఇదే బలహీనతను ఆసరాగా తీసుకొని అక్రమ మద్యం వ్యాపారులు అడ్డు అదుపు లేకుండా తమ వ్యాపారాన్ని నిరాటకంగా కొనసాగిస్తున్నారు.

నియోజకవర్గ ప్రజాప్రతినిధుల అండతోనే తీరంలో అనాదిగా మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయనడంలో సందేహం లేదు. తీర గ్రామాల్లో మత్స్యకారుల అనారోగ్యానికి అసలు మూలాలైన నాసిరకం మద్యం అమ్మకాలను శాశ్వతంగా నిరోధించాలని సర్వత్రా కోరుతున్నారు.

లివర్ వ్యాధుల పరీక్షలు అంటూ రాపిడ్ కిట్లు, మందులకు లక్షలు వెచ్చించే అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కూడా వారు కోరుతున్నారు.

కోడిపందాలపై ఆకస్మిక దాడి

విశాలాంధ్ర-లింగపాలెం: పుప్పాలవారిగూడెంలో కోడిపందాలు వేస్తున్న వారిపై ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్నబాబు తమ సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.2,800 నగదు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: స్థానిక బస్టాండ్ వద్ద ఏజెన్సీ శెట్టిబలిజ యువజన సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ సంఘం మండల యువజన అధ్యక్షుడు గుబ్బల సత్యంబాబు ఆధ్వర్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు శెట్టిబలిజ యువజన సంఘం వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం చలివేంద్రంలో ఏర్పాటు చేసిన మజ్జిగ, నిమ్మరసం నీళ్లను ఎమ్మెల్యే ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబు, స్థానిక తహశీల్దార్ చలపతిరావు, ఎంపీడీవో జ్యోతి, ఏఎస్డబ్ల్యూఎస్ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ పిల్లి అరవల రాజు, ఉపాధ్యాయులు సమ్మంగి సత్యనారాయణ, కోశాధికారి యాండ్ర వెంకటేశ్వరరావు, తంగెళ్ళ నాగేంద్ర, దుంగ శివ, సమ్మంగి శివ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి కళారంజని జాతీయస్థాయి నాటకోత్సవాలు

విశాలాంధ్ర -భీమవరం: ఈనెల 16, 17, 18వ తేదీల్లో జరిగే కళారంజని జాతీయస్థాయి నాటకోత్సవాలను జయప్రదం చేయాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన నాటకోత్సవాల కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా ఎన్నో వ్యయ ప్రయసలు కోర్చి కళారంజని నాటక పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని దీనికి దాతలు సహకారం కూడా మరువలేనిదని అన్నారు. సంస్థ అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్ మాట్లాడుతూ 13 సంవత్సరాలపాటు నిర్వహించిన జాతీయస్థాయి నాటక ఉత్సవాలు ఈ సంవత్సరంతో 14వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నామని అన్నారు. ఈ నాటకోత్సవంలో మూడు రోజులు ఆరు నాటికలు ప్రదర్శిస్తున్నారని ఆయన అన్నారు. దీంతోపాటు రాష్ట్రంలో కళా రంగంలో, రచనారంగంలో రాటు తేలినటువంటి రచయితలకు కళాకారులకు కళారంజని సత్కరిస్తుందని ఆయన తెలిపారు. సంస్థ కార్యదర్శి మెంటే పూర్ణచంద్రరావు, కార్య నిర్వహణ కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న ఇతివృత్తాలను నాటిక రూపాలుగా తయారుచేసి ప్రదర్శనలు జరుపుతు న్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలను పట్టణంలోని గునుపూడి ఉమా సోమేశ్వర జనార్ధన స్వామివారి కళ్యాణ మండపం ఆవరణలో జరుగుతుందని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే నాటిక పోటీలను కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి. అర్జున్ రావు, ఆక్వా శ్రీనివాస్, పోసింశెట్టి మురళి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయం ముస్తాబు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ హరి హరసుత అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో ద్వాదశ 12వ వార్షికోత్సవ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని శరవేగంగా కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా సెక్రెటరీ గంగు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పుష్కరకాలానికి వచ్చే ద్వాదశ 12 వ వార్షికోత్సవం 9, 10, 11 తేదీల్లో గురవాయిగూడెం అయ్యప్ప స్వామి దేవాలయంలో జరగనుందని తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని దైవదర్శనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లిపర కృష్ణారావు, రొక్కం కృష్ణారావు, అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అర్జీలకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి : జిల్లా రెవెన్యూ అధికారి

విశాలాంధ్ర-ఏలూరు: పిజిఆర్ఎస్ అర్జీలకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)

కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, జిల్లా కలెక్టరు కార్యాలయం ఏవో యన్.వి. నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా జిల్లా వివిధ మండలాలు నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలు పరిశీలించి నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం పిజిఆర్ యస్ ద్వారా ప్రజలు నుండి 333 ధరఖాస్తులు అందాయి. ఈ సమావేశంలో ఆర్డీవో అచ్యుత అంబరీష్,డీయల్డీవో ఏ.బి.వి.వి.లక్ష్మీ, జిల్లా కలెక్టరు కార్యాలయం ఏవో యన్.వి. నాంచారయ్య,వివిధ శాఖల అధికారులు,రెవిన్యూ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ఆకుల వెంకట్‌కు నివాళులు

విశాలాంధ్ర- ఉండి : ఎన్టీవీ రిపోర్టర్ ఆకుల వెంకట్ సంతాప సభ ఉండి మార్కెట్ యార్డ్ లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. వెంకట్ చిత్రపటానికి పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు,

వ్యాపార, పారిశ్రామిక వేత్తలు, విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్ట్ సోదరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్చార్జి పివిఎల్ నరసింహరాజు, ఎంపీడీవో ఎస్ రవీంద్ర, పాలకోడేరు ఎస్సై మంతెన రవి వర్మ, తాసిల్దార్ నాగార్జున ,మండల వ్యవసాయ అధికారి సంధ్య, పారిశ్రామిక వేత నారాయణరెడ్డి, బ్రహ్మారెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుగా శ్రీనివాస్, మాట్లాడుతూ వెంకట్ ఆకస్మిక మరణం చాలా బాధాకరమన్నారు. అందరితో ఆప్యాయంగా ఉండే వెంకట్ మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్ కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సోదరులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధి కారులు, వ్యాపార, వాణిజ్య సంస్థల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, బంధుమిత్రులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర- పాలకోడేరు :ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. వి. రంగం నాయుడు ఆధ్వర్యంలో పాలకోడేరు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు .

ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండాకాలం గనుక వడ దెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను గూర్చి విపులంగా తెలియజేశారు. ఈ ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ నిరంజని, సిహెచ్ఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, హెల్త్ సూపర్వైజర్లు శంకర్, అమ్మాజీ, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోమొబైల్ వృత్తిదారులకు ఆటోనగర్‌లో స్థలాలు కేటాయించాలి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: అర్హులైన ఆటోమొబైల్ వృత్తిదారులకు ఆటోనగర్లో స్థలాలు కేటాయించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ది ఏలూరు ఆల్ ట్రేడ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటోనగర్లో స్థలాలు ఇవ్వాలని, ఏలూరు నగరంలో షెడ్లు నిర్మించుకుంటున్న వారిపై మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలని ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు నగరంలో అన్ని అర్హతలు ఉండి ఆటోనగర్ ఏర్పాటు సమయంలో మాగంటి నాగభూషణం చేసిన అక్రమ అవకతవకల వల్ల స్థలాలు పొందని సుమారు 200 మంది ఆటోమొబైల్ వృత్తిదారులు ఏలూరు నగరంలో అద్దె స్థలాలలో సొంత షెడ్లు నిర్వహించుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు గత పది రోజులుగా ఏలూరు నగరంలో ఆటోమొబైల్ షెడ్లపై ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. ఏలూరు నగరంలో షెడ్లు నిర్వహించ కూడదని తక్షణమే ఆటోనగర్ కు తరలి వెళ్లాలని, వారు పని చేసుకునే ప్రదేశాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయడం హేయమైన చర్య అని అన్నారు.జిల్లా కలెక్టర్ వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు తీసుకొని షెడ్లు నిర్మించుకుంటున్న వారిపై వేధింపులు చేయడం సరికాదన్నారు. తక్షణమే ఏలూరు నగరంలో ఆటోమొబైల్ వృత్తిలో జీవనోపాధి పొందుతున్న వారిని ఆటో నగర్ లో స్థలాలు కేటాయించి వారు ఆటోనగర్ తరలి వెళ్లకపోతే చర్యలు తీసుకోవాలని ఆటోనగర్ లో స్థలాలు లేక ఏలూరు నగరంలో పనిచేయడానికి మున్సిపల్ అధికారులు ఆంక్షలు విధిస్తే ఈ కార్మికులందరూ ఏ పని చేసి కుటుంబాన్ని పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోమొబైల్ వృత్తిదారుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులు స్పందించి ఏలూరు నగరంలో ఆటోమొబైల్ వృత్తిలో కొనసాగుతున్న వారికి తక్షణమే ఆటోనగర్లో స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ కన్వీనర్ ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ 2011 నుండి ఆటోనగర్లో స్థలాల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించామని,2013 వ సంవత్సరంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 86 రోజులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించిన సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ జైన్ ఈ సమస్య పరిష్కారం కోసం ఆరుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయించారని ప్రస్తుత కలెక్టర్ ఆ విషయాలను తెలుసుకొని ఆటోనగర్ లో స్థలాలు కేటాయింపులు చేసిన మరుక్షణం ఏలూరు నగరంలో ఉన్న మెకానిక్ షెడ్లను ఆటోనగర్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొండాడ హరి నారాయణమూర్తి,కొప్పిశెట్టి వెంకటపతి,కాటూరి శ్రీధర్,గ్రంధి నాగ రవి కిషోర్,మహబూబ్ షరీఫ్, పొన్న ధర్మరాజు,,పాలకొండ శ్యాంప్రసాద్, కాదులూరి చంద్రశేఖర్, బొడ్డు సురేష్, కర్రి రామకృష్ణ, మెరుగుమాల రవికుమార్, ఆరేపరపు రఘు,ఉప్పులూరి కేశవరావు, నాయుడు నారాయణరావు,లక్కోజు నాగరాజు, మరకాల సందీప్,మోరు అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కలిదిండి: ఆరోగ్యకరమైన బిడ్డ జన్మించాలంటే గర్భిణీ స్త్రీలు జాగ్రత్త తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జాహ్నవి, హేమంత్ తెలిపారు. సోమవారం కలిదిండిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం పాటిస్తే వారి భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందన్నారు. ప్రతి గర్భిణీ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు,

జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బిడ్డ ఆరోగ్యంతో పాటు మంచి జీవితం అందించిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ కిషోర్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వలసలను తగ్గించేందుకే ఉపాధి హామీ పథకం

విశాలాంధ్ర - కలిదిండి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వలసలను తగ్గించి సమస్యలను పరిష్కరించేందుకు ఉపాధి హామీ పథకం అని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని మట్టగుంట గ్రామంలో 2025-2026 సంవత్సరానికి గాను ప్రతిపాదించిన పనులను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించేందుకు పేదరికను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మంచి పథకం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని తెలిపారు. ఈ పథకాన్ని ఉపయోగించుకుని ప్రజలందరూ ఉపాధి పొందాలని సూచించారు. ఈ

కార్యక్రమంలో తిరుమాని. పాండురంగారావు, ఉప సర్పంచ్ కోకా. సుజాత, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బళ్లా. రాజు, దున్నా. సత్యనారాయణ, కొల్లాటి. గోకనేశ్వర రావు, ఫీల్డ్ అసిస్టెంట్ కొల్లాటి. సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : జిల్లాలోని ఏలూరు పార్లమెంటు నియోజక వర్గ పరిధిలోని 216-ఏ, 16 జాతీయ రహదారుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏలూరు జిల్లా భీమడోలు, కుర్లెళ్లగూడెం, పూళ్ళ, కైకరం, చేబ్రోలు, నారాయణపురం గ్రామాల సమీపంలో గుర్తించిన ఏడు బ్లైండ్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు ఫ్లై ఓవర్లు లేదా సబ్‌వేలు నిర్మించాలని, సీతంపేట వద్ద ఫ్లై ఓవర్, బాక్స్ కల్వర్టు, ఉంగుటూరు గ్రామంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మార్చి 11న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలతో కూడిన వినతి పత్రాలను కేంద్ర మంత్రికి అందజేశారు. ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తులకు సానుకూ లంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బదులిచ్చారు. వినతిపత్రంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు అంశం ప్రభుత్వం పరిశీలనలో ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం:విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫీర్ అహమ్మద్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు మండలంలోని 33/11కె వి, రాజు పోతేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11కె వి కొత్త గూడెం ఫీడర్ పరిధిలో ఆర్ డి ఎస్ ఎస్ పనులు జరుగుతున్నందున ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించి తమ వాహనాలను నడపాలని ఆర్‌టీఓ ఎంఏ మధాని తెలిపారు.

జంగారెడ్డిగూడెం డివిజనల్ మోటార్ వెహికల్ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. కొయ్యలగూడెం మండలం నరసన్న పాలెం గ్రామ శివారు కరాటం వై జంక్షన్ వద్ద, జంగారెడ్డిగూడెం మండలం గురువాయిగూడెం వద్ద,స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో ఎం ఏ మదాని ద్విచక్ర వాహనదారులకు పలు సూచనలను తెలియజేశారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా, తలకు హెల్మెట్ ఉండాలని, హెల్మెట్ వాడడం వలన తలకు రక్షణ ఉంటుందని అన్నారు.వాహనాలు నడిపేవారు తమ వాహనాల పేపర్లను తప్పనిసరిగా సరిచూసుకోవాలని, ప్రతి ఒక్కరికి లైసెన్స్ చాలా ముఖ్యమైనదని, వాహనం నడిపేటప్పుడు మితిమీరి వాహనాలు నడిపి తమ ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దని పలు సూచనలను సూచించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగనాయకులు,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వై.సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం అడవికొలను గ్రామంలో సంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు, శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా జరుగుతున్న శ్రీ రాముల వారి రథయాత్రలో సోమవారం ఉంగు టూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు,

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన అధ్య క్షులు కోటికలపూడి గోవిందరావు, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ రథోత్సవంలో భాగంగా శ్రీ రాముల వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లిన నేపథ్యంలో భక్తులంతా పెద్ద ఎత్తున ప్రసాదాలు స్వామి వారికి సమర్పించారు. అనంతరం నాయకులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నిడమర్రు మండలం జనసేన, టిడిపి, బిజెపి అధ్యక్షులు, ఉంగుటూరు ఏఎంసీ చైర్మన్, నియోజకవర్గ ముఖ్య నాయకులు, గ్రామ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, తెలుగు మహిళలు స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై బైండ్ ఓవర్ కేసులు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం : పాత సారా కేసుల్లో ఇద్దరు వ్యక్తుల పై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల టి నరసాపురం మండలంలోని కొత్త గూడెం గ్రామంలో పాత నాటు సారాయి కేసుల్లో నిందితులుగా వున్న ఇద్దరు వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్, మేజిస్ట్రేట్ టి నరసాపురం తహశీల్దార్ టి సాయి బాబా ఎదుట 129 బీఎన్ ఎస్ ఎస్ చట్టం ప్రకారం హాజరు పరచి బైండ్ ఓవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ లు ఆర్ వి ఎల్ నరసింహా రావు, అబ్దుల్ ఖలీల్,కె జగ్గా రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకరించాలి

విశాలాంధ్ర-ఉంగుటూరు: నిరుద్యోగుల స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుటకు బ్యాంక్ మేనేజర్లు సహకరించాలని ఉంగుటూరు ఎంపీడీవో జిఆర్ మనోజ్ కోరారు.గత నెల 26,27 తేదీల్లో నిర్వహించిన చంద్రన్న స్వయం ఉపాధి సోపాన ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆయా బ్యాంకులకు పంపించనున్నట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్లు అభ్యర్థుల యూనిట్లను పరిశీలించి ఆ యూనిట్ స్థాపనకు సహకరించి నిరుద్యోగ యువతను ప్రోత్సహించవలసిందిగా ఉంగుటూరు ఎంపీడీవో జీ ఆర్ మనోజ్ కోరారు. సోమవారం ఉంగుటూరులోని యూబీఐ బ్యాంకు మేనేజర్ ,నారాయణపురంలోని ఎస్ బి.ఐ, కైకరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లను, ఫీల్డ్ ఆఫీసర్‌ను కలిసి, వారిని సంప్రదించి యూనిట్ల స్థాపనకు సహకరించవలసిందిగా కోరారు. ఎంపీడీవో వెంట మండల పరిషత్ కార్యాలయం సీనియర్అసిస్టెంట్ ఫణి ఉన్నారు.

పదోన్నతులు ఉద్యోగ బాధ్యతలను పెంచుతాయి

కమిషనర్ భాను ప్రతాప్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : పదోన్న తులు పొందడం అనేది ఉద్యోగ రీత్యా మరిన్ని బాధ్యతలు పెంచు తుందని, అర్హతలను బట్టి ప్రతి ఒక్కరికి నిర్ణీత సమయంలో పదోన్నతులు కల్పిస్తామని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ. భాను ప్రతాప్ చెప్పారు. కార్పొరేషన్ లో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు సీనియార్టీని పరిగణలోకి తీసుకొని వారికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. సోమవారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ ఎన్ ఆర్.పెదబాబు, కమిషనర్ ఎ. భాను ప్రతాప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలు పైగా మున్సిపల్ కార్పొరేషన్లో సేవలు అందిస్తున్న

ఎస్వివి.రాజారావు, ఓలిపల్లి రవి, తోట మాణిక్యాలరావులకు సీనియార్టీ ఆధారంగా పదోన్నతులు కల్పించినట్లు వివరించారు. పదోన్నతి పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతతో పనిచేసి ప్రజలకు మరిన్ని సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మూర్తి, సి-1 అప్పారావు ఉన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: ఆక్వా రైతులను అన్ని విధాల ఆదుకోవాలని, ఆక్వా రైతులను దోపిడీ చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పాలకొల్లు మండలం పూలపల్లి వై జంక్షన్ వద్ద ఆక్వా రైతుల భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆక్వా రైతులు తరలివచ్చి తమ సమస్యలను చెప్పుకున్నారు. అనంతరం జై భారత్ క్షీరా రామ సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులు ప్రస్తుతం మద్దతు ధర లేక అల్లాడుతున్నారని చెప్పారు. కావాలనే కొందరు సిండికేట్ గా మారి రొయ్య ధరను పతనం చేస్తున్నారని విమర్శించారు. ఆక్వా రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ సంఘం ఏర్పడిందని, మద్దతు ధర లభించే వరకు తమ పోరాటం ఆగదు అన్నారు.

ఇందుకోసం ప్రస్తుతం ఆక్వా క్రాఫ్ హాలిడే ను ప్రకటించామని తెలిపారు. రైతులందరూ సమిష్టిగా ఆక్వా క్రాప్ హాలిడే ను పాటించాలని విజ్ఞప్తి చేశారు. పోరాటంలో క్రమశిక్షణ ఉన్నప్పుడే ప్రభుత్వం స్పందిస్తుందని ఆక్వా రైతులందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. అనంతరం పాలకొల్లు భీమవరం ప్రధాన రహదారిపై వందలాదిమంది ఆక్వా రైతులతో కలసి రాస్తారోకో నిర్వహించారు. బోనం చినబాబు, కర్నేన గౌరు నాయుడు, పెనుమత్స సత్యనారాయణ రాజు,మేడిది జాన్ డేవిడ్ రాజు పెద్ద సంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పల్లికొండ కిరణ్మయి ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పోలీస్ స్టేషన్ వరకు ఆరోగ్య సిబ్బంది చే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లికొండ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్య మన్నారు. ఆరోగ్యం లేకపోతే ఎంత కూడబెట్టిన డబ్బయినా నిరుపయోగం అన్నారు. తల్లి బిడ్డ సంరక్షణతోనే

ఆరోగ్యకరమైన భవిష్యత్తు అని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నట్లయితే సమాజమంతా ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది వెల్సన్ బాబు, పబ్లిక్ హెల్త్ నర్స్ సిహెచ్ వెంకట సత్యవతి, హెల్త్ విజిటర్ సిహెచ్ పద్మజ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏ ఎన్ ఎం లు ,ఆశ కార్యకర్తలు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, JALLI DAVID (New Name), S/O CHARLIES, Previously Called DAVID SALLI (Old Name), Resident of D.No:2-57, Cheruvu Gattu, Sivadevuni Chikkala, Palakollu Mandal, W.G.Dt., Pin:534245, Andhrapradesh. I have changed my name from DAVID SALLI (Old Name) To JALLI DAVID (New Name) for all practical purposes.

కాగుపాడు సర్పంచి సుధేష్ణ సస్పెన్షన్

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కాగు పాడు పంచాయతీ సర్పంచ్ కడియాల సుధేష్ణను సస్పెండ్ చేస్తూ ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఉత్తర్వులు జారీ చేశారు .పంచాయతీలో పలు ఆర్థిక అవకతవకలు జరిగాయని వంకిన మాధవరావు చేసిన ఫిర్యాదు ఆధారంగా అధికారులు విచారణ చేశారు. ఈ క్రమంలో సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తదుపరి

ఉత్తర్వులు వెలువడేంత వరకు ఉప సర్పంచ్ పొట్ల ఏడుకొండలుకు సర్పంచ్ విధులు నిర్వహించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారని పంచాయతీ కార్యదర్శి దుర్గాధర్ పేర్కొన్నారు.

సగంచెరువులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామంలో 60 కె.వి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూటమి నాయకులు ప్రారంభించారు. ఎంతోకాలంగా గ్రామంలో విద్యుత్తు లోవోల్టేజీ సమస్యతో గ్రామస్తులు

ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం లో నాయకుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో ఎన్నికలకు ముందు మంత్రి రామానాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. స్పందించిన నిమ్మల రాబోయేది తమ ప్రభుత్వమేనని, సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్య పరిష్కారం జరిగేలా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు మంత్రి రామానాయుడు ఆదేశాలు ఇచ్చారు. దీంతో గ్రామంలో నూతన విద్యుత్ ట్రాన్సార్మర్ ను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాబోయే ఏ.ఎం.సి చైర్మన్, ప్రస్తుత మండల టిడిపి అధ్యక్షులు కోడి విజయభాస్కర్, విద్యుత్ శాఖ డిఈఈ రామకృష్ణ, ఏఈ శ్రీనివాస్, ఎంపీటీసీ మామిడి శెట్టి లలిత కుమారి, చెల్లబోయిన సహదేవుడు, శీలం అశోక్, గూడాల లలిత రాజు, కళ్యాణం శ్రీనివాస్, శీలం వరప్రసాద్ కడలి నాగమణి, ఇంటి శ్రీరాముడు, రాయి ప్రసాద్ అందే కోటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు

వర్ష సూచనతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు: వర్ష సూచన, వాతావరణంలో మార్పుల వలన రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని ఉంగుటూరు తహసిల్దార్ పి.రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వర్ష సూచనపై మండలంలో వీఆర్వోలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. వరి కోతలు కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. వర్ష సూచనలు ఉన్నాయని, రైతులను అప్రమత్తం చేయాలని, సరైన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారం ప్రభుత్వాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వై.పూర్ణ చంద్ర ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కృష్ణాలయం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

విశాలాంధ్ర - రామచంద్రపురం : రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కాజులూరులో నూతనంగా నిర్మించనున్న శ్రీకృష్ణాలయంకు సుభాష్ సోమవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితం ఆధ్యాత్మిక జీవితంలో ముడిపడి ఉందని తద్వారా మానసికతను పొందవచ్చని పేర్కొన్నారు. కొత్త ఆలయ నిర్మాణానికి సహకారం అందించడానికి దాతలు భక్తులు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. అదే విధంగా ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మాతా, శిశువుల ఆరోగ్యమే సమాజానికి పునాది

విశాలాంధ్ర - కడియం : 'మాతా శిశువుల ఆరోగ్యమే, ఆరోగ్యకర సమాజానికి పునాది' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిలుపునిచ్చిందని, దీనికి అనుగుణంగా ప్రజలలో అవగాహన కల్పించాలని డాక్టర్ ఎం మణి జ్యోత్స్న అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కడియం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ కోసంలో 23 అర్జీలు స్వీకరణ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పిజిఆర్ఎస్ - మీ కోసం' లో ప్రజల నుంచి 23 అర్జీలను స్వీకరించడం జరిగిందని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కేతన గార్గ్ మాట్లాడుతూ, నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, ఎస్.ఈ ఎం సిహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి కోటయ్య , నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వి . వినూత్న తదితరులు పాల్గొన్నారు.

'తిరుమల విద్యాసంస్థ'ల నూతన ప్రాంగణానికి భూమిపూజ

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం రూరల్ వేమగిరి వద్ద హైవే ప్రక్కన తిరుమల విద్యాసంస్థల నూతన ప్రాంగణానికి భూమిపూజ చేయడం ఎంతో ఆనందంగా ఉందని సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ వేమగిరి చుట్టుప్రక్కల ప్రాంతాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు తమ డేస్కాలర్ క్యాంపస్‌ను వేమగిరిలో ప్రారంభిస్తున్నామని, వేమగిరి క్యాంపస్‌లో ఎల్.కె.జి. నుంచి ఇంటర్ వరకు క్లాసులు జరుగుతాయన్నారు. 2026-27 నుంచి అడ్మిషన్లు జరుగుతాయని ఆయన తెలియజేశారు. ముందుగా తిరుమల రావు - సరోజిని దేవి దంపతులు భూమిపూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజిని దేవి, అకడమిక్ డైరెక్టర్ జి. సతీష్ బాబు, ప్రిన్సిపల్ వి. శ్రీహరి,తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సోమవారం కలెక్టరేట్ లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భం గా జిల్లా జాయింట్ కలెక్టర్ యస్ . చిన రాముడు, ఇతర అధికారులతో కలిసి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పోస్టర్ ను అవిష్కరించారు. ఈ సందర్భం గా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, ఆరోగ్య కరమైన ప్రారంభం, ఆశా జనక భవిష్యత్తులు అనే నినాదం తో ప్రపంచంలో ఆరోగ్య దినోత్సవాలు జరుపుకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతుగా బాధ్యతను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య నియమాలు పాటించాలని, ప్రజలందరూ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందించే అన్ని సేవలతో పాటు, ఎప్పటి కప్పుడు వైద్య ఆరోగ్య శాఖ వారు ఇచ్చే ఆరోగ్య సలహాలు పాటించాలన్నారు. ముఖ్యంగా తల్లి నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించడం, వారికి అవసరమైన వైద్య సేవలు అందించడం ద్వారా మాతృ మరణాలు , శిశు మరణాలు తగ్గించడనికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా రెవెన్యు అధికారి టి .సీతారామమూర్తి ,ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ దికారి డా యన్ . వసుందర , డి సి హెచ్ ఎస్ డా . ఎన్ పి పద్మ శ్రీ రాణి , జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె..విజయ కుమారి , సి పి ఓ . ఎల్.అప్పల కొండ , జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కే ఎన్. జ్యోతి , జిల్లా అప్పమాలజిస్టు, జిస్ట్ సుదీర్ బాబు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. తదానంతరం రాజవోలు రోడ్డులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖా దికారి డా యన్ . వసుందర ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఇన్చార్జి జిల్లా ఇమ్యూ నైజేషన్ అధికారి డా . మౌనిక. డా , నిషాంత్ , .డి పిహెచ్ యన్ఓ . వసంత లక్ష్మి , వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది , ఏ యన్ ఏం లు ,ఆషా కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఆర్డీవో

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం చేయాలని ఆర్డీఓ ఆర్. కృష్ణనాయక్ డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన 'పి జి ఆర్ ఎస్ - మీ కోసం' వేదిక లో వచ్చిన అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణ నాయక్ మాట్లాడుతూ 'పి జి ఆర్ ఎస్ - మీ కోసం' ద్వారా ప్రజల నుంచి ఈరోజు తొమ్మిది అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : కూటమి ప్రభుత్వంలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేసుకోవడం జరుగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. కిర్లంపూడి మండలంలోని జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి గ్రామాల్లో రెండు కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించిన సిసిరోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణం కీలకమని, ప్రణాళిక బద్ధంగా మండలంలో రహదారులను అభివృద్ధిని చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని రోడ్లను, డ్రైన్లను నిర్మించుకొని జగపతినగరం పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో దాదాపు రూ.70 కోట్లు వెచ్చించి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో కనీసం 7 కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలకు తప్ప కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి ఆదుకున్న పరిస్థితులేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారిని ఆదుకునేందుకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తున్నామన్నారు. అయితే అందరికీ ఒకేసారి ఇవ్వలేమని, దఫా దఫాలుగా అర్హులందరికీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా చిన్న బాబు, కిర్లంపూడి మండల టిడిపి అధ్యక్షులు చదరం చంటిబాబు, టిడిపి నాయకులు తోట గాంధీ, తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, ఎండిఓ హరికృష్ణ, పంచాయతీరాజ్ డిఇ ఉమా శంకర్, జేఈ నారాయణమూర్తి, కూటమి నాయకులు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాలు అందజేత

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఆరుగురు దివ్యాంగులకి అవసరమైన పరికరాలు అందచెయ్యడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు తెలియ చేశారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ లో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ, లాలాచెర్వు, రాజమహేంద్రవరం వారి సౌజన్యంతో పల్లిక సతీష్ కుమార్ - రాజమండ్రి , నిమ్మల్న వెంకటేష్- కొవ్వూరు, రేలంగి దుర్గారావు - గోరేపట్నం, కె.సంధ్యా వతి - బొమ్మూరు కృత్రిమ అవయాలు (లింబ్స్) , భావన శ్రీను - రాజమండ్రి క్రక్స్ , వనం వీర బాబు - క్రక్స్ అండ్ వీ చాట్‌లను అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - కడియం : వాట్సప్ ద్వారా ఎక్కడినుంచైనా ప్రభుత్వ సేవలు వినియోగించుకోవచ్చుని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పలివెల పృధ్వీరాజ్ అన్నారు. కడియం మండలంలోని మురమండ గ్రామంలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు గ్రామానికి చెందిన రైతు మద్దిపాటి చినబాబు, సాగునీటి సంఘం అధ్యక్షుడు గన్ని రామారావు, పెదబాబి, దేవళ్ళ రామ్మోహన్ రావు, వట్టికూటి జానకి రామయ్య, దత్తుడు తదితర నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రం, ధాన్యం తేమ పరీక్షా యంత్రం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వట్టికూటి శ్రీనివాస్, పోతుల శేషగిరి, చొల్లంగి సతీష్ కుమార్, ఉప సర్పంచ్ యర్రంశెట్టి వీరబాబు, రెవిన్యూ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, సొసైటీ సిబ్బంది అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్ధాలతో క్యాన్సర్ ముప్పు

విశాలాంధ్ర - కరప : ప్లాస్టిక్ వ్యర్థలతో క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కరప మండలం నడకుదురు గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను విచక్షణారహితంగా వాడకుండా ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎన్నుకోవాలని శ్రీనివాసరావు గ్రామస్తులకు సూచించారు. ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాస్టిక్ వాడకం పెరిగిందని దీనివలన క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉందని బయట ఫుడ్ తెచ్చుకునేటప్పుడు ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి ఫుడ్‌ని ప్యాక్ చేసి ఇస్తున్నారని దీనివలన ప్లాస్టిక్ కరిగి శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్‌కు దారితీస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరిజ, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - అనపర్తి : రామవరంలో రూ. 1కోటి 50 లక్షల నిధులతో నిర్మించే శ్రీ పార్వతీ రామలింగేశ్వర దేవస్థానం పునః నిర్మాణానికి ప్రముఖ హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు సోమవారం శంకుస్థాపన చేశారు. తొలుత వేద పండితుల మంత్రాల నడుమ ప్రత్యేక హోమం అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి సత్యవతి, హృషికేష్‌రెడ్డి, డాక్టర్ భ్రమర, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : నియోజక వర్గంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో పీఎం సూర్యఘర్ ఎంఎయఫ్ టీ బిజ్లీ యోజన పథకం, యువ నాయకులు బండారు సంజీవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధి, ఉద్యోగ అవకాశాల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యానందరావు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 60 మంది నమోదు చేసుకున్నారని నిరుద్యోగులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా తొమ్మిది రోజుల శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, పాలూరి సత్యానందం మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం పిహెచ్‌లో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీపట్నం వైద్యులు జె సతీష్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వ ఆరోగ్యమైన ప్రారంభం ఆశాజనకమైన భవిష్యత్తు అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లులు, నవజాతి శిశువులు ఆరోగ్యం ఎంతో ముఖ్య మని తెలిపారు. ప్రస్తుతం మరణాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువులకు ఎలా సంరక్షణ కల్పించాలో ఆయన వివరించారు. అదేవిధంగా ఆడవారికి 21, మగవారికి 25 సంవత్సరాలు వివాహాలు చేయాలన్నారు. ప్రతి స్త్రీ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ శ్రీకృష్ణుడు సూపర్వైజర్ వి అశోక్ వర్ధన్ కే జే ఎం జెస్సి ఎన్ ఎన్ వి సత్యనారాయణసంధ్య శాంతి శ్రీ ఆశా కార్యకర్తలు అంగన్వాడి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

విశాలాంధ్ర - సీతానగరం: నేటి సమాజంలో ఆరోగ్యకరమైన జీవితం మహాభాగ్యం అని మండల వైద్య అధికారి డాక్టర్ చైతన్య అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది 'ఆరోగ్యమే మహాభాగ్యం' అందరికీ సంపూర్ణ ఆరోగ్యం మన లక్ష్యం" అనే నినాదాలతో ప్లకార్డులు పట్టుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయస్ రాయుడు, సూపర్వైజర్ కె.సుధాకర్, చంద్రశేఖర్, లిజి, స్పందన, సుందరి, ఆశా కార్యకర్తలు కుమారి, దేవి,జ్యోతి, విజయ, షర్మిల, రామసీతా,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

60 కుటుంబాలకు ఇద్దరు సాధికారిక సారథులు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జగ్గంపేట: ప్రతి 60 కుటుంబాలకు ఒక పురుషుడు, ఒక స్త్రీ సాధికార సారథులుగా వ్యవహరిస్తారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. పార్టీలో కుటుంబ సాధికార సారథుల పేరిట కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామన్నారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గండేపల్లి మండల సారథులు నియామకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సు మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు తొలగించేలా ఈ సారథులు పని చేస్తారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతి కుటుంబానికి సంక్షేమం అభివృద్ధి చేరాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని దీనికి అనుకూలంగా పక్కా వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇకపై పార్టీలో ఉన్న సెక్షన్ ఇంచార్జ్‌లు

అందరినీ కుటుంబ సాధికార సారథులుగా పిలుస్తామన్నారు. సాధికార సారథులుగా పురుషులతో సమానంగా మహిళలకు సమాన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రతి కుటుంబానికి న్యాయం చేసేందుకు ఈ విభాగం పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్యదొర, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, పాలకుర్తి ఆదినారాయణ, బొల్లం రెడ్డి రామకృష్ణ, సుంకవిల్లి రాజు, యర్రంశెట్టి బాబ్జి, పాల్గొన్నారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి : సత్యవతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : 2025 26 ఆర్థిక సంవత్సరమునకు 20,692 మంది ఎసి.సి. నిరుద్యోగ యువతకు రూ.862.69 కోట్ల రూపాయలతో, రూ.2.50 లక్షల నుండి రూ. 20.00 లక్షల విలువగల (32) రకాల వివిధ స్వయం ఉపాధి వృత్తులు చేపట్టుటకు, అందుకు అనుగుణంగా తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఎస్సీ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జే. సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా లో ఎసి.సి. నిరుద్యోగ యువతకు ఈ క్రింది పేర్కొనబడిన విధముగా స్వయం ఉపాధి పథకములు అమలు చేయుటకు లక్ష్యమును నిర్దేశించినట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కు మొత్తం రూ.3716.20 లక్షలులతో యూనిట్లు 891లక్ష్యంగా మంజూరు చేయడం జరిగిందన్నారు. సబ్సిడీ రూ.1468.32 లక్షలు, బ్యాంకు లోను రూ.2062.07 లక్షలు , లబ్దిదారుని వాట రూ.185.81 లక్షలు చెల్లించవలసి ఉంటుందన్నది ఈ పథకము కింద అర్హత కలిగిన లబ్ధిదారులు ప్రయోజనం కోసం ఔత్సాహక ఎస్.సి. నిరుద్యోగ యువతీ యువకులు వారి ఆన్ లైన్ దరఖాస్తులను డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి 14వ తేదీ నుంచి https://apobmms.apcfss.in వెబ్ సైట్ అందుబాటులోకి రానుంది. తదిగడవు మే 10 లోపు అందజేయవలెను ఇతర వివరములకు, ఔత్సాహికులు వారి సంబంధిత మండల అభివృద్ధి అధికారి మున్సిపల్ కమిషనర్ వారి కార్యాలయములలో సంప్రదించవలెను.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు సోమవారం ఉదయం గం.11.00ల నుండి సాయంత్రం గం.5.00లవరకు కాపు, బిసి మరియు ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి వివిధ గ్రామాలలో దరఖాస్తుదారులను ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్, బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 426 మంది దరఖాస్తుదారులకు 242 మంది హాజరైనారని ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్ తెలిపారు. మండల పరిషత్ పరిపాలనాధికారి వి రామ స్వరూప్, మండల పరిషత్ సిబ్బంది, మరియు వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి కల్యాణ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : నేడు జరుగనున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ ఏర్పాట్లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. ఆర్డీఓ శ్రీకర్, డీఎస్పీ మురళీ మోహన్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యానందరావు అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్), కాయల జగన్నాథం, ఏపుగంటి రాంబాబు, ఏపుగంటి వెంకటేశ్వరరావు మరియు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబసాధికార సారథులు నియామకంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : పార్టీలో కుటుంబ సాధికార సారథుల పేరిట కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెల్లడించారు. జగ్గంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గండేపల్లి మండల కుటుంబ సాధికార సారథుల నియామకంపై అవగాహన సదస్సు మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రతి 60 కుటుంబాలకు ఈ సాధికార సారథి ఇన్చార్జ్‌లుగా ఒక పురుషుడు, ఒక స్త్రీ మూర్తి వ్యవహరిస్తారన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించేలా ఈ సారథులు పని చేస్తారని తెలిపారు. ఇకపై పార్టీలో ఉన్న సెక్షన్ ఇంచార్జ్‌లు అందరినీ కుటుంబ సాధికార సారథులుగా పిలుస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి న్యాయం చేసేందుకు ఈ విభాగం పని చేస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, పాలకుర్తి ఆదినారాయణ, బొల్లం రెడ్డి రామకృష్ణ, సుంకవిల్లి రాజు, పాల్గొన్నారు.

నేడు బీసీ రుణ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - సీతానగరం: నేడు బీసీ, కాపు, ఈ డబ్ల్యుఎస్ రుణ లబ్దిదారులకు బ్యాంకర్లచే ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపిడిఓ ఎమ్ భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఓబి ఎమ్ఎమ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల చేసుకొన్న లబ్దిదారులకు బ్యాంకు వారిచే ఇంటర్వ్యూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సీతానగరం గ్రామం వెలంపేట వద్ద గల కామ్యూనిటి హాల్‌లో ఏర్పటు చేయడం జరిగిందన్నారు. లబ్దిదారులు అందరు సంబంధించిన ధృవపత్రములు ఒరిజినల్, జిరాక్స్ లతో హాజరు కావలని కోరారు.

ఆదిత్య ఫార్మసీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెం, ఆదిత్య ఫార్మసీ కాలేజీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహిం చారు. ఈ అవగాహన సదస్సు కాకినాడ మెడికోవర్ హాస్పిటల్, సహకారంతో, 'హెల్తీ బిగినింగ్స్ అండ్ హోప్‌ఫుల్ ఫ్యూచర్స్' అనే అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికోవర్ హాస్పిటల్‌కు చెందిన డా కె వంశీకృష్ణ (ఎండి, జనరల్ మెడిసిన్) ముఖ్య అతిథిగా హాజరై, ఈ వేసవి కాలానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిపై విలువైన సమా చారాన్ని అందించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డా డి సతీష్ కుమార్, డా వంశీ కృష్ణకు దుశ్శాలువా జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయ సిబ్బంది సుజియా, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

11న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఎస్ఆర్‌విబిఎస్‌జెబి మహారాణీ కాలేజీ, పెద్దాపురంలో 11 శుక్రవారం జరగనున్న 'మెగా జాబ్ మేళా' వివరాలు తెలుపు ప్లకార్డులను కలెక్టర్ సగిలి షాన్ మోహన్ ఐఎస్ సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. సుమారు 35 ప్రముఖ కంపెనీల్లో 1097 ఉద్యోగాలకు 11 శుక్రవారం పెద్దాపురంలో జరుగుతున్న మెగా జాబ్ మేళాలో జిల్లాలోని అర్హులైన అభ్యర్థులందరూ పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఐఎస్, డిఆర్ఓ జె వెంకట్రావు, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె లచ్చారావు మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధునాతన ఫీచర్లతో అర్బన్ క్రూయిజర్ హైరైడర్

విశాలాంధ్ర -కాకినాడ: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈరోజు అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో భద్రత, సౌకర్యం సౌలభ్యాన్ని పునర్ని ర్వచించే ఫీచర్ అప్‌గ్రేడ్‌లను ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్ యు వీ గా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే 1 లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటింది. ఇది దాని వినూత్న సాంకేతికత, అసాధారణమైన ఇంధన సామర్థ్యం, శక్తివంతమైన పనితీరు, ప్రీమియం డ్రైవింగ్ అనుభవంతో హృదయాలను గెలుచుకుంటూనే ఉంది. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ లో ఇప్పుడు ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు జోడించబడ్డాయి. ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తూ 6 ఎయిర్‌బ్యాగ్‌లు ఇప్పుడు అన్ని వేరియంట్‌లలో ప్రామాణికంగా ఉన్నాయి. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌కు ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ జోడించబడింది. సౌకర్యం కోసం 8-వే అడ్జస్టబుల్ పవర్ డ్రైవర్ సీట్, యాంబియంట్ లైటింగ్, క్యాబిన్ లోపల మెరుగైన గాలి నాణ్యత పర్యవేక్షణను నిర్ధారిస్తూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ డిస్ప్లే జోడించబడింది. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ పరిచయం గురించి సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా మాట్లాడుతూ ఎస్ యూ వీ సెగ్మెంట్ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, తమ శ్రేణిని మెరుగు పరుస్తూనే ఉన్నామన్నారు. తాజా అర్బన్ క్రూయిజర్ హైరైడర్ అనేది అత్యుత్తమ సాంకేతికత, అధునాతన భద్రత , ఉన్నతమైన సౌకర్యం అందించాలనే నిబద్ధతకు నిదర్శనమన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి : సీపీఐ

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : రాజమండ్రి నగర పరిధిలో కొన్ని ప్రాంతాలలో మున్సిపాలిటీకి చెందిన స్థలాలు ఖాళీగా ఉన్నాయని వాటిపై భూ కబ్జాదారుల కన్ను పడుతుందని వెంటనే ప్రభుత్వం ఆలోచించి ఖాళీగా ఉన్న స్థలాలలో పేదవారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో నగర శాఖా కార్యదర్శుల సమావేశం యూనియన్ అధ్యక్షులు కూండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి తాటిపాక మధు మాట్లాడుతూ కొంతమంది భూకబ్జాదారులు నగరంలో ఖాళీగా ఉన్న మున్సిపాలిటీ దేవాదాయ స్థలాలపై కన్ను పడిందని వాటిని ఏదో రూపంలో దక్కించుకోవడం కోసం అమరావతి వేదికగా ప్రయత్నాలు మొదలు పెట్టారని ఈ నేపథ్యంలో నూతన కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చింది కాబట్టి వెంటనే ఆ స్థలాలలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు రెండు సెంట్లు చొప్పున పంపిణీ చేయాలన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తీసుకుని ఆవ దేవాదాయ భూమైనదాని కోర్టులో వేసి వేలాదిమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. రాజమండ్రి సిటీ మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు దూరదృష్టంతో ఆలోచించి పేదలకు మున్సిపాలిటీ స్థలాలలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అక్కడ కాకుండా ఎక్కడో సుదీరప్రాంతంలో ఇస్తే పట్టణాలకు పనులకు రాలేరని అందుకే నగరంలో ఉన్న స్థలాలు కేటాయించాలని మధు కోరారు. పార్టీ నగర కార్యదర్శి వి కొండలరావు, కార్యక్రమాల రిపోర్టును భవిష్యత్ కర్తవ్యాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి సప్పు రమణ, నగర కార్యవర్గ సభ్యులు చింతలపూడి సునీల్ కే శ్రీనివాస్, పి లావణ్య, పి త్రిమూర్తులు, టీ నాగేశ్వరరావు, నల్ల రామారావు, శాఖా కార్యదర్శులు వానపల్లి సూర్యనారాయణ, కే కొండావతి, రమణ, రామరాజు నాగబాబు, అల్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో- ఆరోగ్యం

విశాలాంధ్ర - నిడదవోలు : వ్యాధులు,ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండడం వల్ల రోగాల నుంచి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని తాడిమల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె ఆశాలత అన్నారు. తాడిమల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇవో దేవదాన్, పీహెచ్ఎన్ ఏమేలియమ్మ, పీఎంఓఓ ప్రసన్నకుమార్, హెచ్ వి రత్నమ్మ, ఏఎన్ఎం రాణి, ఆశాలు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్ ప్రాంతంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు కోరారు. సోమవారం సాయంత్రం ఆయన మార్కెట్ పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్ సిబ్బంది పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ ద్వారా నీరు సక్రమంగా వెళ్ళే విధంగా సూచనలు ఇచ్చారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి, కనకదుర్గమ్మ గుడి వద్ద నీరు నిలవ ఉండే అవకాశం ఉన్నందున దాని నివారణకు ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని, ఆ ప్రాంతాన్ని మెరక చేయవలసిన అవసరం ఉందని ఆయన సూచన చేశారు. కార్యక్రమంలో దాట్ల పవన్ పిఏసీఎస్ రాజు, రవి వర్మ, వాసంశెట్టి రాజేశ్వరరావు, బందారు ఏసు, కడలి సత్యనారాయణ, కముజు రాంబాబు, కముజు సర్వేష్, వెంట్రు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

విశాలాంధ్ర - పిఠాపురం : సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణికి కౌన్సిలర్ అల్లవరపు నగేష్ రెండు పిర్యాదులు అందజేశారు. అందులో మొదటిది పిఠాపురం పట్టణంలో ఈ మధ్య కాలంలో సుప్రీంకోర్టు ఆర్డినెన్స్‌కి విరుద్ధంగా ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు కట్టేశారని, దానివల్ల పర్యావరణానికి ముప్పు అంతే కాకుండా దానివల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మధ్య పిఠాపురం మెయిన్ రోడ్డులో బస్ స్టాప్ పైన గాలిలో ఫ్లెక్సీలు పెట్టారని, అవి గాలికి విరిగి ప్రజలు పైన పడే విధంగా ఉన్నాయని వాటిని వెంటనే తొలగించి, ఫ్లెక్సీలు క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ దాటిన తరువాత ఆంజనేయస్వామి ఆలయం వెనుక పురపాలక సంఘం స్థలం ఆక్రమించి ప్రైవేటు వ్యక్తులు నాలుగు షాపులు కట్టడం జరిగిందన్నారు. అవి పురపాలక సంఘం అధికారులు తమకు తెలియదు అని చెప్పటం శోచనీయమన్నారు. అందుకే వాటిపైన పిజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు.

ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలి : చప్పిడి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆహారం నియమాలు పాటించాలని వెనకబడిన తరగతుల సంక్షేమ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు హెల్త్ అవేర్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉచిత మధుమేహ, రక్త పోటు పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రపంచ ఆరోగ్య సంస్థ 1950 నుంచి ప్రతి సంవత్సరం ఈ ఆరోగ్య దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని, ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, వ్యాయామము, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని, తద్వారా రక్త పోటు, అలాగే గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి పద్మావతి, భవాని దుర్గ నాగమణి అనంత్ పాల్గొన్నారు.

కడియాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర- దేవరపల్లి: దేవరపల్లి దేవర కడియాలమ్మ ఆలయంలో అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు పెదసన గంటి సాయిబాబు, పెండసనగంటి శశికాంత్ శర్మ ప్రత్యేక కుంకుమ పూజలు దేవరపల్లిలో దేవర చెరువు వద్దగల శ్రీ దేవర కడియాలమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరపల్లికి చెందిన గన్నమని వెంకటేశ్వరరావు, గన్న మని శ్రీనివాస్, గన్నమని పెద్ద అబ్బులు , పసుపులేటి శివనాగ ప్రసాద్ తదితరులు విగ్రహ ప్రతిష్టలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు, జనసేన నేతలు కంబాల సత్తిబాబు, ఆకుల నాని, దుగ్గిన లీల గంగాధరరావు నాయుడు జాజిమొగ్గల శ్రీనివాస్ మాధవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

సాధారణ ప్రసవానికి గర్భిణీలు నడవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : సాధారణ ప్రసవం జరగాలంటే గర్భిణీ స్త్రీలు ప్రతీ రోజూ ఉదయం సాయంత్రం పది నిముషాలు పాటు నడవాలని, పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని ప్రసూతి వైద్యులు పిఆర్ఎస్‌జి వర్మ సూచించారు. సాధారణ ప్రసవం, గర్భిణీల ఆహారపు అలవాట్లపై సోమవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద సూపరింటెండెంట్ టి ప్రణీత్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లకు గర్భిణీ స్త్రీలకు వర్మ అవగాహన కల్పించారు. ప్రసవం తేలికగా జరగడానికి చేయాల్సిన వ్యాయామాలు, పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆపరేషన్ కంటే సాధారణ పురుడు వలన కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు.

స్టేట్ బ్యాంక్ ఇన్సూరెన్స్ పథకాలు

విశాలాంధ్ర-తాళ్లపూడి : స్టేట్ బ్యాంక్ ద్వారా ఖాతా దారులకు అకౌంట్లు ఓపెన్ చెయ్యటం, అప్పులు ఇవ్వటంతో పాటు, వారి కుటుంబాల వారికి భరోసా కల్పిస్తూ, అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ నష్ట పరిహారం పొందే విధంగా బీమా పథకాలు అమలు చేస్తున్నామని ప్రక్కిలంక స్టేట్ బ్యాంక్ మేనేజర్ బి.వెంకటయ్య తెలిపారు. పిఏఐ, పిఎంజెజెవై, పిఎంఎస్‌బివై అనే మూడు రకాల ఇన్సూరెన్స్‌లు బ్యాంక్ ద్వారా అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పోచవరంకు చెందిన ఓ ఖాతాదారు, రైతు ఆకస్మిక మరణం చెందగా బాంక్‌లో బీమా పథకం ద్వారా రెండు లక్షలు అందచేసామన్నారు. ఏటా రెండు వేల రూపాయలు చెల్లిస్తే ఆక్సిడెంట్ పాలసీగా 40 లక్షలు బీమా వస్తుందని, రూ.424 లు చెల్లిస్తే సహజ మరణానికి సైతం 2లక్షలు బీమా, కేవలం 25 రూపాయలు చెల్లిస్తే ఆక్సిడెంటల్ బీమా రెండు లక్ష రూపాయలు చొప్పున బ్యాంక్ ద్వారా ఇన్సూరెన్స్ అందిస్తారని మేనేజర్ తెలిపారు. బ్యాంక్ లో ఖాతా దారులు తమ కుటుంబ ఆర్థిక ప్రయోజనం కొరకు వారికి భరోసా కలిగించే ఈ ఇన్సూరెన్స్ పథకాలను వినియోగించు కోవాలని తెలిపారు.

బధిర విద్యార్థులకు ఉచిత మొబైల్స్ అందజేసిన

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా భిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరుగుతున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఆరుగురు బధిరులకు రూ.15 వేలు విలువైన మొబైల్ ఫోన్లు ఉచితంగా అందజేసారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ ఇన్చార్జి ఏడీ లక్ష్మణరావు, సూపరింటెండెంట్ శ్రీరామ్ పాల్గొన్నారు.

యువత ప్రాణ త్యాగాలే స్వాతంత్ర్యం ఫలాలు : జేడీ

విశాలాంధ్ర - రాజానగరం : నాటితరం యువత నాడు దేశం కోసం ప్రాణత్యాగాలు చేయడం ద్వారా నేటితరం యువత స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్నరని సీబీఐ విశ్రాంతి అధికారి, ప్రముఖ రాజకీయ నాయకులు లక్ష్మీ నారాయణ వివి(జెడి లక్ష్మీ నారాయణ) అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో దేశ నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై సోమవారం జరిగిన ఇంట్రాక్షన్ ప్రోగ్రామ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడి లక్ష్మీ నారాయణ తొలుత నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రోగ్రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో యువత తీసుకున్న నిర్ణయాలు, కృషి ఫలితంగా ప్రపంచంలోని జపాన్ వంటి దేశాలు అభివృద్ధి చేందాయన్నారు. యువత అంటే వయస్సుతో సంబంధం లేదని మన మనసుకు సంబంధించిన అంశం అని గుర్తు చేశారు. నేటి యువత మొబైల్ ఫోన్స్‌తో బిజీగా ఉన్నారని, రీల్స్, షాట్స్ చూస్తూ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. సెల్‌ను మనం కంట్రోల్ చేస్తున్నామా, మనల్ని సెల్ కంట్రోల్ చేస్తుందా అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా రాజమహేంద్రవరం ఔన్నత్యం పెరగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం యువత మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని, మద్యం నాన్న రక్తం, ధూమపానం అమ్మ ఊపిరి తాగుతున్నాం అని గుర్తు చేసుకోవాన్నారు. వర్సిటీ ప్రాంగణంలోని గ్రంథాలయం,మైదానం రెండు దేవాలయాలని వీటని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజు నాలుగు రకాల శిక్షణలను పొందాలని శరీరానికి శిక్షణ, మనసుకి శిక్షణ, మాటకు శిక్షణ, ఆలోచన విధానాలకు శిక్షణ ఇవ్వాలన్నారు. సావిత్రి బాయ్ పూలే వంటి మహనీయురాలి కృషి ఫలితంగా మహిళలు విద్యను అభ్యసిస్తున్నారని, మహనీయుల చరిత్రను చదువుకోవాలన్నారు. అమెరికాలో భారతీయులకు వీసాలు ఆపేసిన భయమెందుకు మన దేశానికి అమెరికా వాళ్ళు రావడానికి వీసాలు కోసం ప్రయత్నించే రోజును యువత తీసుకురావాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ యువత ఒక దేశం యొక్క బలం మరియు పురోగతికి మూలస్థంభాలుగా ఉంటారన్నారు. సమాజాలలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడం లో యువకులు గణనీయమైన పాత్ర పోషించారని చరిత్రను గుర్తు చేశారు.అనంతరం యూనివర్సిటీ సెమినార్ హాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీపీఐ విజ్ఞప్తి

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి ప్రజా వాణి కార్యక్రమంలో కలెక్టర్‌కి అనేక ప్రజా సమ స్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర సమితి నేత చలసాని వెంకట రామారావు నేతృత్వంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రామారావు జిల్లా కలెక్టర్ దృష్టికి నూజివీడు-ముసునూరు-ఏలూరు ప్రధాన రహదారి పొడై అనేక సంవత్సరాలు గడుస్తున్న నిర్మాణం చేయకపోవడంతో నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిపై సిపిఐ అనేక ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. బలివే ఉత్సవాల్లో తమ్మిలేరులో మునిగి ముగ్గురు యువకులు చనిపోయారని ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే వ్యవసాయ అప్పులు తీర్చలేక ముసునూరు మండలం గోగులంపాడు, రమణక్కపేట గ్రామాల్లో కౌలు రైతులు చెన్ను రాజారావు, నాగబోయిన రాజశేఖర్ కుటుంబాల్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిర్చి పంట రైతుల ఎదుర్కొంటున్న పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు నిమ్మగడ్డ నరసింహ, రాయంకుల లక్ష్మణరావు, కూచిపూడి నాగేశ్వరరావు, ముఖర్జీ బాధిత కుటుంబ సభ్యులు చెన్ను సుజాత, హెచ్చు నాగదుర్గ, పేరిచర్ల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల పెంపు..
పేదలపై పెను భారం : మన్నవ

విశాలాంధ్ర -ఏలూరు: సోమవారం అర్ధరాత్రి నుంచి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. పెట్రోల్,డీజిల్ పై రూ.2 ఎక్సైజ్ డ్యూటీ, గృహ వినియోగదారులకు సంబంధించిన గ్యాస్ ధర రూ.50 పెంచినట్లు కేంద్రం పేర్కొనడం సరైన చర్య కాదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమెరికా అధ్యక్షులు ట్రంప్ సుంకాల పెంపు ఘాటు మన దేశానికి తాకినట్లుగా కనపడుతుందని ఎద్దేవా చేశారు. పెట్రోల్,డీజిల్, అమ్మకం ధరలను నిర్ణయించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పనిచేస్తున్న 4 పెట్రో కంపెనీలకు ఇచ్చిందని, అయితే ఆ కంపెనీలతో సంబంధం లేకుండానే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధర పెంచడం దుర్మార్గం అన్నారు. పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర ధరలు పెరిగి ప్రజలపై పెను భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పతనమైనా భారత్‌లో ధరలు పెరగడం విడ్డూరంగా ఉందన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు.

మాజీ డిఎస్పీ కుటుంబానికి ప్రభుత్వ విప్ దాట్ల పరామర్శ

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని రామాలయం వీధిలో విత్తనాల అర్జునరావు(రిటైర్డ్ డిఎస్పీ) భార్య మంగాయమ్మ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ప్రభుత్వం విప్, స్థానిక శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు సోమవారం అర్జునరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అయన వెంట దాట్ల పవన్, పిఎస్ఎన్ రాజు, బందారు యేసు, వాసంశెట్టి రాజేశ్వరరావు, రిటైర్డ్ ఎస్ఐ కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కే రవి తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు అప్పాజీకి మంత్రి సుభాష్ పరామర్శ

విశాలాంధ్ర - అమలాపురం : మాతృ వియోగంతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్టు ఇందుపల్లి సర్పంచ్ చోళ్లంగి శివాలినీ అప్పాజీ ఆయన సోదరుడు సోమేశ్వర రెడ్డిని రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసం శెట్టి సుభాష్ సోమవారం సాయంత్రం ఇందుపల్లిలోని వారి స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల అప్పాజీ తల్లి యోగిని కన్నుమూసారు. మాతృ వియోగంతో బాధ పడుతున్న అప్పాజీని సోమేశ్వరరెడ్డిని మంత్రి సుభాష్ పరామర్శించారు. ఆయన వెంట మల్లుల పోలయ్య, మల్లుల రామ కృష్ణ, కుడుపూడి శ్రీనివాస్ తదితరులు వున్నారు.

ప్రైవేటు బస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సోమసుందర్

విశాలాంధ్ర -భీమవరం: ప్రైవేట్ సంస్థల బస్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, వారి సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ డిమాండ్ చేశారు. జనతా బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం ప్రకృతి ఆశ్రమం తోటలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డి.సోమసుందర్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు , పలు ప్రైవేటు సంస్థలకు చెందిన వందలాది బస్సుల్లో పెద్ద సంఖ్యలో డ్రైవర్లు, ఇతర కార్మికులు పనిచేస్తున్నారని, అయితే వారి సంక్షేమాన్ని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు.. ప్రైవేటు బస్సులు , ఇతర వాహనాలకు చెందిన కార్మికులకు కార్మిక చట్టాలు అమలు కాకపోవడం విచారకరమన్నారు. బస్సు కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలన్నారు. కార్మికుల సమస్యలను కార్మికశాఖ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఏఐటియూసీ భీమవరం ఏరియా కార్యదర్శి, యూనియన్ గౌరవాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు సమావేశానికి అధ్యక్షతవహించి మాట్లాడుతూ వివిధ ప్రైవేటు విద్యాసంస్థలు, ఆక్వా , తదితర ప్రైవేటు కంపెనీల బస్సుల్లో పనిచేసే డ్రైవర్లు , క్లీనర్లు, మెకానిక్‌ల తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితం కావడం హర్షణీయమని అన్నారు. వారి హక్కుల కోసం ఏఐటీయూసీ తరపున కృషి చేస్తామని రంగారావు తెలిపారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని కోరారు. సమావేశంలో దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ఏరియా ఏఐటీయూసీ నాయకులు ఎం.లక్ష్మీపతి , జనతా బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాసాని వెంకటేశ్వరరావు, తాడి వీర వెంకట సత్యనారాయణ (పండు), కొప్పినీడి మురళీ మోహన్ , బత్తిన సుబ్బారావు, సంగీతం మంగన్న తదితరులు మాట్లాడారు.

పీజీఆర్ఎస్‌కు 17 వినతులు

విశాలాంధ్ర - కాకినాడ : సోమవారం నిర్వహించిన డెయిల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఇంజనీరింగ్ సమస్యలు ఐదు, ప్రజారోగ్య విభాగానికి నాలుగు, హార్టికల్చర్ ఒకటి, మొత్తంగా 9 వినతులు అందాయి, ప్రజా సమస్యలు పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్‌కు 17 వినతులు అందినట్లు అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ తెలిపారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సదరు కార్యక్రమంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు హాజరు అయ్యారు.

నేల కొరిగిన వృక్షాలు, పంటలు, విద్యుత్ పోల్స్

విశాలాంధ్ర-తాళ్లపూడి : తాళ్లపూడి మండలంలోని అనేక ప్రాంతాల్లో విపరీతంగా వీచిన ఈదురు గాలులకు గజ్జరం నుంచి పైడిమెట్ట వెళ్లే మార్గ మధ్యలో ఆర్ అండ్ బి రోడ్డు పక్కన ఉన్న ఏళ్ల నాటి చింత చెట్టు నేలకొరిగి మెయిన్ రోడ్ పై పడింది. ఈ రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గండి రాంబాబు ఆ ప్రదేశానికి వెళ్లి హుటాహుటీనా సంబంధిత అధికారులకు ఆర్ అండ్ బి ఏ.ఈ, మరియు వీఆర్ఓ, రెవెన్యూ అధికారులకు తెలియపరచి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలో కొన్ని చోట్ల, రాగోలపల్లి వెళ్లే రహదారిలోను కరెంట్ పోల్స్ పడిపోయాయి. విద్యుత్ పునరుద్ధరించుటలో సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో వీచిన ఈదురు గాలులు పంటలపై ప్రభావం చూపింది. కొన్ని చోట్ల వరి, అరటి, మొక్క జొన్న పంటలు నేలకు వాలాయి. గజ్జరం చుట్టుపక్కల ముఖ్యంగా మొక్కజొన్న ఎక్కువ నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. పెనుగొండ సతీష్ అనే రైతు సుమారు ఎకరంలో వేసిన మొక్కజొన్న మొత్తం పడిపోయింది. ఒక వారం రోజులు ఉంటే పొత్తులు విరిచేద్దామని, పంట చేతికి వచ్చే సమయం లో తమ కష్టం నేలపాలైందని, సుమారు 40 వేలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

23 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత
నాలుగు వాహనాలు సీజ్

విశాలాంధ్ర - రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం లోని ఒకే రోజు నాలుగు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 23 టన్నుల రేషన్ బియ్యని సంబంధిత అధికారులు పట్టుకు న్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్(పౌరసరఫరాల శాఖ),ఎంఎస్వో గొలుగూరి బాపిరాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి పై రాజానగరం మండల పరిధిలో జిఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలో ఉదయం 10.30 నుంచి 12.30 మధ్యలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న మూడు వాహనాలను ఏక కాలంలో సీజ్ చేసినట్లు చెప్పారు. ఏపీ 39 యుబి 1314 నంబర్ గల వాహనంలో 15390 కేజీలు, ఏపీ 39 యుఎ 6550 నంబర్ గల వాహనంలో 3670 కేజీలు బియ్యం, ఏపీ 39 యుబి 5549 నంబర్ గల వాహనంలో 2540 కేజీలు రేషన్ బియ్యం వీటితోపాటు రాజానగరం ప్రధాన రహదారిపై మరో వాహనాన్ని విజిలెన్స్ అధికారులు ఎంఎస్‌వో సంయుక్తంగా సోదా చేయగా 2180 కేజీల బియ్యాన్ని పట్టుకున్నారు. దీంతో 23780 కేజీల అక్రమ బియ్యం పట్టుకున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు పట్టుబడ్డ ముగ్గురు డ్రైవర్లు ఆకుల స్వామి, కోరుకొండ అచ్చిరాజు,కోన బాలరాజు తో పాటు బియ్యం, వాహనముల యజమానులపై వివిధ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. పట్టుబడ్డ బియ్యం విలువ రూ.11,21,600 ఉండగా, వాహనముల విలువ 24 లక్షలు అన్నారు. మొత్తం విలువ రూ.35,21,600లు అన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నూజివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలు రీఓపెన్ కాకుండా వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తోపాటు ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, కలిసి కలిసి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా శాఖాధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి అర్హులైన వారి అర్జీలను నిర్దిష్ట గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలుతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ కె. భీమేశ్వరరావు, డిపిఓ కె. అనురాధ, డిసిఓ ఏ. శ్రీనివాస్, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, గృహ నిర్మాణ శాఖ పిడి సత్యనారాయణ, పౌరసరఫరాల సంస్థ జిల్లాల మేనేజర్ శ్రీలక్ష్మి, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ త్రినాథ్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి : ఎంపిడిఓ

విశాలాంధ్ర – అల్లవరం : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం ద్వారా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇప్పటికే బిసి, కాపు కార్పొరేషన్ లోన్లుకు దరఖాస్తు చేసిన వారిలో అర్హులకు బ్యాంకుల ద్వారా యూనిట్స్ త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని ఈ నెల 11 నుండి ఎస్సి కార్పొరేషన్ రుణాలకు అర్హులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని గ్రామాల్లో త్రాగునీటి, పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పనులు ద్వారా రైతులకు ప్రయోజనం కలిగేలా పనులు చేపట్టాలని ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో చైల్డ్ ఆధార్ నమోదు చేయాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వచ్చిన అర్జీలు సకాలంలో పరిష్కారం చేయాలని సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు సమాధానాలు సకాలంలో పంపాలని పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పింఛన్ ప్రతిపాదనలు జాప్యం లేకుండా ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి బి లక్ష్మణరావు, మండల ఇంజనీరింగ్ అధికారి ఫకీర్, ఈఓ ఆర్డియూ నాగేంద్ర, ఉపాధి హామీ ఏపిఓ శ్రీను బాబు సిబ్బంది పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని పూర్తిగా నియంత్రించాలి

విశాలాంధ్ర – ఆలమూరు : దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా వ్యాధి నివారణాధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం జొన్నాడ ఇటుక బట్టీలను, పెదపళ్ల పీహెచ్సీని ఆయన పరిశీలించారు. దోమల వ్యాప్తిని నివారించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎప్పటికప్పుడు జ్వర సర్వే నిర్వహించి తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులతో అన్నారు. కార్యక్రమంలో పెదపళ్ల పీహెచ్సీ వైద్యాధికారి డా సాయి కిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కులు, ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్వైజర్లు శ్రీనివాస్, ఉమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ద్రాక్షారామంలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర – రామచంద్రపురం : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం నియోజవర్గం ద్రాక్షారామంలో భీమేశ్వర దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ మన శరీర ఆరోగ్యానికి మూల కారణం నోటి ఆరోగ్యం అని ప్రతి ఒక్కరూ గుర్తించి నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా చెడు బ్యాక్టీరియా మన శరీర అవయవాల మీద తీవ్ర ప్రభావం చూపుతుందని తద్వారా ఎన్నో అనారోగ్య సమస్యలు ప్రధానంగా నోటిలో చిగురు వాపులు గుండె జబ్బులకు సంకేతం అన్నారు అనంతరం రోగులకు నోటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, గ్రామ ప్రజలు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర – చాగల్లు : స్థానిక భవిత కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న ఫ్యామిలీకి సోమవారం కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖ సిబ్బంది మాట్లాడుతూ గత నెల 30న ఆయాగా పనిచేస్తున్న మరియమ్మ కుమారుడు (దివ్యాంగుడు) మరణించడం జరిగింది. మేము ఉన్నామని చిన్న భరోసా ఇవ్వడానికి మా వంతు సాయంగా రూ.30000 అందిస్తున్నామని తెలిపారు.

ఆక్వా జోన్ పై రైతుల ఆందోళన

విశాలాంధ్ర – అల్లవరం : కొమరగిరిపట్నం గ్రామంలో ఆక్వా జోన్ పై రైతులు ఆందోళన చెందుతున్నారు, 29-3-2025 తేదీనాడు గ్రామంలో ఆక్వా జోన్ పై జరిగిన సభలో రైతులు అభ్యంతరాలు తెలపడంతో వాయిదా వేశారు. కొమరగిరిపట్నం నీటి సంఘం పరిధిలో నల్లవ నెంబరు పంట కాలువ ఆనుకొని పంచ నది డ్రైన్ నుండి ఊట గుంట సావరం వరకు గల సాగు భూములు 2021వ సంవత్సరంలో మత్స్యశాఖ అధికారులు ఆక్వా జోన్లో చేశారు అని సమాచారం. దీనిపై రైతులు మాకు తెలియకుండా మా భూములు ఆక్వా జోన్ పరిధిలోకి ఎలా చేర్చారు అని ఆందోళన చెందుతున్నారు. దీనిపై కొందరు రైతులు మండల గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరిగింది, ఇప్పటికె కొమరగిరిపట్నం గ్రామంలో త్రాగునీరు పంట కాలువలలో సాగునీరు లేక కనీస అవసరాలకు త్రాగునీరు లేక గ్రామ ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మండల స్థాయి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో తహసీల్దార్ ప్రసాద్, పిడబ్ల్యుడిఏఈ రెహమాన్, డ్రైన్స్ శాఖ డిఈతో పాటు పలు శాఖల అధికారులు ఆ యొక్క ప్రాంతానికి వచ్చి పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ స్పందించి, పంచనది డ్రైన్ నుండి ఉప్పునీరు సమీప పంట పొలాలలోకి రాకుండా షట్టర్లను ఏర్పాటు చేసియున్నారు. దీని వలన కొంత ప్రాంతం సాగులోనికి వచ్చింది, ఈనాడు ఉప్పు నీటి సమస్య అధికారుల దృష్టిలోనికి వచ్చిన పట్టించు కున్న దాఖలాలు లేవు ఇద్దరు ముగ్గురు రైతులు ఉద్దేశపూర్వకంగా, ఉప్పు నీటిని పంట చేలలో పెట్టడంతో ఆ ప్రాంతం అంతా వరి సాగుకు వీలు లేకుండా పోయింది దీనివల్ల భూగర్భ జలాలు ఉప్పు కయ్యలుగా మారి కొబ్బరి తోటలు, అంతర పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాడి పశువులకు నీరులేక పశు సంపద తగ్గిపోతున్నదని పాడి రైతులు తెలుపుతున్నారు. దీనిని సంబంధిత శాఖల అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అయితే గ్రీవెన్స్ సెల్ ఉన్నప్పటికీ మత్స్య శాఖ అధికారులు కొమరగిరి పట్నంలో ఆక్వా జోన్ గ్రామ సభ ఏర్పాటు చేయడం పై గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర – ఆలమూరు : శారీరక, మానసిక ఆరోగ్యంతోనే పరిపూర్ణమైన జీవన ఆనందం సాధ్యమవుతుందని పెదపళ్ళ, చొప్పెళ్ళ పీహెచ్సీ వైద్యాధికారులు డి సాయికిషోర్, కె శ్రీకాంత్ లు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి ఆరోగ్య రక్షణ హక్కు కోసం 1948 ఏప్రియల్ 7న డబ్యూహెచ్ఓ నెలకొల్పిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రతియేటా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. డబ్యూహెచ్ఓ పిలుపు మేరకు కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం సుమలత ఆదేశాలతో ఆయా పీహెచ్సీ వైద్యాధికారులు కె శ్రీకాంత్, డి సాయికిషోర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఆరోగ్యకర ఆరంభాలు-ఆశాజనక భవితవ్యాలు అంటూ నినాదాలు చేసారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మాతా శిశుసంరక్షణ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె జ్యోతికుమార్, హెచ్ఈలు ఏవివి రాజా, బి సూర్యనారాయణ, సూపర్వైజర్లు ఎం శ్రీనివాసరావు, పి శివప్రసాద్, పి ఉమ, ఆర్ బాలామణి పాల్గొన్నారు.

పిఠాపురం యువకుడి దర్శకత్వంలో “శివాజ్ఞ”

విశాలాంధ్ర – పిఠాపురం : శివ పరమాత్మ క్రియేషన్స్ బ్యానర్‌లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో భారీగా విడుదలైన ఆధ్యాత్మిక చలన చిత్రం “శివాజ్ఞ”. ఈ చిత్రం భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో రూపొందించారు. శివ పరమాత్మ జ్ఞానాన్ని, రాజయోగ విధానాన్ని అందరికీ తెలియజేయాలనే సదుద్దేశంతో ఈ చిత్రాన్ని ప్రజల్లోకి తీసుకొచ్చారు. ఈ చిత్రానికి పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామానికి చెందిన వివిఎస్వివి మణికంఠ దర్శకత్వం వహించారు. స్వతహాగానే ఆధ్యాత్మిక ఆలోచనలు కలిగిన మణికంఠ ఈ చిత్రాన్ని భక్తిరస దృశ్యకావ్యంగా తెరకెక్కించారు. ఈ చిత్రం విడుదలైన మొదటి ఆట నుంచే ప్రేక్షకులకు హృదయాలలో జ్ఞానం నింపుతూ మంచి విజయంతో దూసుకుపోతుంది. మంచి ఆధ్యాత్మిక చిత్రం దర్శకత్వం వహించిన వివిఎస్వివి మణికంఠకు పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు అభినందనలు తెలియజేశారు.

చింతలూరు నూకాలమ్మ ఆలయానికి విరాళం

విశాలాంధ్ర – ఆలమూరు : మండలంలోని చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయానికి గుమ్మిలేరుకు చెందిన ముత్యాల వీర భాస్కరరావు, కృష్ణ వేణి దంపతులు సోమవారం రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ముందుగా తమ కుటుంబ సభ్యులైన ముత్యాల విజయకిరణ్, శ్రీవల్లి, ప్రమోద్ శౌర్య, ప్రణీత్ రామ్, ఉండవల్లి వీర వెంకట గోపీ చౌదరి, విజయ లక్ష్మి, నిక్షిత్, ఆద్యలతో కలిసి నూకాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాలిగోపురం నిర్మాణం నిమిత్తం ఈ మొత్తం విరాళాన్ని వినియోగించమని కోరుతూ దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావులకు అందజేశారు. కార్యక్రమంలో వైట్ల గంగరాజు, వైట్ల శేషుబాబు, వాకా గోవిందరాజు, దాసరి సుబ్బారావు, పులుగుర్త పవన్ కుమార్, తాళ్ళ రాజు పాల్గొన్నారు.

అపరాలు-పచ్చిరొట్ట పైరుల పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర – తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో రాష్ట్ర వ్యవసాయశాఖ పిలుపు మేరకు దాళ్వా పంట అనంతరం ప్రతీ రైతూ తప్పనిసరిగా తమ పంట పొలాల్లో అపరాలు సాగు గాని తక్కువ రోజులు వ్యవధి ఉన్నట్లు అయితే పియండియస్ (24 రకాల విత్తనాలు) కిట్ గాని చల్లాలని కరప సబ్ డివిజన్ వ్యవసాయ అధికారి కే బాబూరావు అన్నారు. ఏఒ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతీ రైతూ తమ పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరిక్షలు చేయించుకోవాలి అన్నారు. రిసోర్స్ పర్సన్ మాధవి మాట్లాడుతూ ప్రతీ రైతూ పెట్టుబడులు తగ్గిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్రతీ రైతూ ఆలోచన చెయ్యాలి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి మరియు కృషి అమృత్ గోవు ఆధారిత వ్యవసాయ క్షేత్ర రైతు ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలకే మన భూమిని పూర్తిగా కలుషితం చేసిన మనం మన భవిష్యత్తు తరాల వారికి ఎటువంటి భూమిని ఇద్దాం అని రైతులను ప్రశ్నించారు. దయచేసి ప్రతీ రైతూ తమ తిండి నిమిత్తం అయిన ఎంతోకొంత భూమిని ప్రకృతి వ్యవసాయం కు కేటాయించాలని, అటువంటి వారికి కూటమి ప్రభుత్వంలో కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించారని, వచ్చే తొలకరి పంటలో అయినా మల్లవరం పంచాయతీలో 200 ఎకరాలు ప్రకృతి వ్యవసాయం సాగును ప్రోత్సాహించాలని, వారికి కావలసిన పూర్తి సహాయ సహకారాలు, కషాయాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతానని తెలియజేశారు. అనంతరం రైతులకు ప్రభుత్వం వారు సబ్సిడీ ద్వారా అందజేసిన అపరాల కిట్‌లను పియండియస్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అజయ్, సుధ, రాజబాబు, పేరాబత్తుల నగిరియ్య, సాయి, భైరవమూర్తి, సింహాచలం, శ్రీను, సత్తిబాబు, బుజ్జి, వర్మ, యంటి ధనలక్ష్మి, ఐసిఆర్పి భవానీ, సూరిబాబు, అర్జున రావు, సత్యనారాయణ, దడా ప్రసాద్ పాల్గొన్నారు.

బంగారం అపహరించిన కేసులో
ముద్దాయిలు అరెస్ట్

విశాలాంధ్ర- భీమవరం టౌన్: గత నెల 29వ తారీఖున పాలకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలి మెడలో గొలుసు అపహరించి అనంతరం అత్యా చారం చేసిన కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , తెలిపారు. దీనికి సంబంధించి భీమవరం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు, పాలకొల్లు పట్నానికి చెందిన గిరిజాల నాగ వెంకట మీనాక్షి దేవి, రెండంతస్తుల భవనంలో, అదే గ్రామానికి చెందిన బొక్క రాజా,మీసాల మావుల్లో,గుజ్జల రామకృష్ణలు మధ్యాహ్న ఒంటి గంట సమయంలో తన క్రింద ఫ్లోర్లో ప్రవేశించి ముందుగా తన మొబైల్ దొంగిలించి, అనంతరం అక్కడ 75 సంవత్సరాల గల ఒక ముసలామె మెడలో ఉన్న బంగారాన్ని దొంగిలించేందుకు ఆమె పీక నొక్కి పక్కనున్న దిండితో గట్టిగా అదిమి, ఇంటి వెనకాల ఉన్న సిమెంట్ దిమ్మ పట్టుకుని ఆమె తలపై విచక్షణ రహితంగా దాడి చేసి, ఆమె మెడలో ఉన్న గొలుసు, చెవి దిద్దులు, గాజులు, హ్యాండ్ బ్యాగ్ లోని 15 వేల రూపాయలు, దొంగి లించి, అనంతరం ముద్దుల ముద్దాయిలు ముసలామె పై అత్యాచారం చేసి పరారయ్యారు, ఇంటికి వచ్చిన ముసలమ్మ కుమార్తె వారి ఇంటిలోని సిసి కెమెరాలో ఉన్న ఫోటోలు చూసి, పాలకొల్లు పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇచ్చారు, కేసు నమోదు చేసిన పాలకొల్లు సీఐ కె. మంగాదేవి, విచారణ చేసి ఈనెల మూడవ తేదీన ముద్దాయిలను పాలకొల్లు రోడ్డులో అరెస్టు చేసి వారు వద్ద నుండి, దొంగిలించిన వస్తువులను స్వాధీనపరుచుకున్నామన్నారు, ఈ కేసును త్వరితగదిన చేదించి ముద్దాయిల అరెస్ట్ చేసినందుకు పోలీసుల్ని ఎస్పీ అభినందించారు...

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - కడియం: 2024 - 25 సంవత్సరానికి గాను, రబీ పంటకు సంబంధించి ప్రభుత్వం క్వింటాల్కు 2300 రూపాయలు మద్దతు ధర ప్రకటించిందని జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ తెలిపారు. కడియం మండలం జేగురుపాడు గ్రామంలో రైతు సేవాకేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం స్టాలిన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ 75 కేజీల బస్తాకు (సాధారణ రకం) 1725 రూపాయలు అని, హమాలీ ఛార్జీలు , రవాణా ఖర్చులు రైతుల ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్, స్థానిక నాయకులు మరెడ్డి రమేష్, కర్రి చినబాబు, పి సుధీర్ కుమార్, పి కోటేశ్వరరావు, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో వాకర్స్ హెల్త్ క్లబ్ సేవలు

విశాలాంధ్ర - జగ్గంపేట : వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లోని రోగులకు వాకర్స్ ఎలెక్ట్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ అధ్వర్యంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే గోకవరం రోడ్డులో ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన చలి వేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ముమ్మిడివరపు సురేష్, ఉపాధ్యక్షుడు విజయ భాస్కర చౌదరి, కార్యదర్శి సతీష్, జోనల్ చైర్మన్ వెత్సా నాగసత్య, చంద్రమౌళి వెంకట శాస్త్రి వాకర్స్, డాక్టర్స్, నర్సులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్లో విజయంపై హర్షం

విశాలాంధ్ర - అమలాపురం : రామచంద్రాపురం బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఉండవల్లి గోపాలరావు ప్యానల్ విజయం సాధించినందుకు వారికి, వారి సహచరులకి ఏబిటియుసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు. అభినందనలు తెలియజేసింది.

వినతులను నిర్ణిత గడువులో పరిష్కరించాలి
కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారించే లక్ష్యంతో ప్రతి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్. జాయింట్ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, జెడ్పీసీఈవో లక్ష్మణరావు, సీపీవో పి త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసరావు, కెఎస్ ఈజెడ్ ఎస్డీసీ కేవీ రామలక్ష్మి ఇతర అధికారులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం-478 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందన ఈ అర్జీలను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. ఆయా శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారంచూపడంతో పాటు సంతృప్తి స్థాయిని పెంచేలా కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో రుడా చైర్మన్ వెంకటరమణ

విశాలాంధ్ర - రాజానగరం : చిన్న వెంకన్న సేవలో రుడా చైర్మన్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి తన అనుచర వర్గంతో సోమవారం దర్శించుకున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులతో కలిసి ఏలూరు జిల్లాలో చిన్న తిరుపతిగా ప్రసిద్దిగాంచిన ద్వారక తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించు కున్నారు.దీనిలో భాగంగా ఆలయ అధికారులు ప్రోటోకాల్ అనుసరించి స్వామి వారి దర్శన భాగాన్ని కల్పించారు. అనంతరం ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి,స్వామివారి ఆశీర్వాదాలు అందించారు. అలాగే ద్వారక తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటం,స్వామివారి వస్త్రాలు ఆయనకు అందజేశారు.ఈ సందర్భంగా విశాలాంధ్రతో చరవాణిలో ఆయన మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తియ్యాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఎన్నికల హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం రాజానగరం పోలీసు స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తండ్రి ఇటీవలే మృతి చెందడంతో సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ను ఆయన స్వగృహంలో కలిసి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, టీడీపీ అధికార ప్రతినిధి నూనె వెంకన్న, నాయకులు చిట్టిప్రోళ్ళ పద్దరాజు, నీలపాల అరవరాజు,దేవన నరసయ్య, సోడా సాని త్రిమూర్తులు,సూరి చక్రం, తోరాట శ్రీనివాస్ పెనుకొండ చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ మండల స్టాక్ పాయింటు పరిశీలన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ 2025-26 సంవత్సరానికి సంబంధించి మండలంలోని ఒమ్మంగి గల స్టాక్ పాయింటును కాకినాడ జిల్లా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్లు రాష్ట్ర పరిశీలకులు భారతి, జిల్లా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ భారతి మాట్లాడుతూ పాఠశాల పునః ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్స్ అందజేయడానికి తగు ఏర్పాట్లు చేసుకోవాలని అలాగనే స్టూడెంట్ కిట్స్ భద్రపరుచుటకు స్టాక్ పాయింట్ వద్ద అన్ని రూముల్లో తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1వి రాజుబాబు, ఎంఈఓ 2 అచ్చిరాజు, ఎంఐఎస్, సిఆర్పిలు గంగారావు, మల్లేష్ మరియు పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు పైడిరాజు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - రామ చంద్రపురం : రామచంద్ర పురంలో వివేకానంద స్కూల్ వార్షికోత్సవం విజయ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ మాట్లాడుతూ స్కూల్ విలువలతో కూడిన విద్యను అందించడంలో కృషి చేస్తుందని వ్యాఖ్యానించారు. అదేవిధంగా జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ నిబద్ధత గల ప్రణాలికతో శ్రీవివేకానంద స్కూల్ కొనసాగుతుందని, పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యా భవనం సాగించడం గర్వకారణం అన్నారు. ఈ ఏడాది పసలపూడిలో ఆరో స్కూల్ ప్రారంభించడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఎన్సీఈఆర్టీ సిలబస్, ఒలంపియాడ్, నీట్ కోర్సులను మూడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు అందజేసినట్లు స్కూల్ కరస్పాండెంట్ బిఎస్ సరోజినీ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : తాగునీటి సమస్య రాకుండా చూడాలని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని తిమ్మాపురం గ్రామ సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ సోమవారం మం డల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రూరల్, ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో త్రాగునీటి సమస్యపై సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ 1,50,000 మంది జనాభా ఉన్న రూరల్ మండలంలో గత రెండు నెలలుగా ఏడిబి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వాటర్ పైప్లైన్ తీయడం వల్ల నీటి కొరతకు ఇబ్బంది ఏర్పడిందని, ముఖ్యంగా మా తిమ్మాపురం గ్రామంలో పందూరు కుళాయి చెరువు నుండి వచ్చే వాటర్ ఆకుపచ్చ రంగులు ఉంటుందని, ఆ నీటిని ప్రజలు ఉపయోగించుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని, ఆకుపచ్చ రంగులో ఉన్న తాగునీటిని ఎమ్మెల్యేకి చూపించి సమస్య పరిష్కరించాలనికోరారు. అనంతరం ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రెండు నెలల్లో తాగునీటి, రోడ్లు, డ్రైన్ మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా పూర్తిచేస్తా అని పూర్తిస్థాయిలో మండల ప్రజానీకానికి ఫిల్టర్ వాటర్ అందిస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే నానాజీ సానుకూలంగా స్పందించడంతో మండలంలోని గ్రామ సర్పంచ్లు అంతా అర్ధద్వనాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.